1

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

బుధవారం | మార్చి 19, 2025 | www.navatelangana.com

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువత దూరంగా ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువత దూరంగా ఉండాలని, అలవాటు పడి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఎస్పీ డివి శ్రీనివాసరావు అన్నారు. ఆన్‌లైన్ గేమ్‌లను ప్రోత్సహించే వారి సమాచారం అందించాలన్నారు. జిల్లాలో ఇటువంటివి జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మోసపూరిత ప్రకటనలు నమ్మి వివరాలు పంపవద్దన్నారు. ఆన్‌లైన్‌లో డబ్బులు ఎక్కువ ఇస్తామంటే ఎట్టి పరిస్థితుల్లో కూడా నమ్మవద్దన్నారు. పెరుగుతున్న ఇంటర్నెట్ అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది మోసగాళ్ల తయారయ్యారని, అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లాలో సోషల్ మీడియాలో పోస్టులు చేసేవారు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అక్రమ బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి ప్రచారం చేయవద్దని పేర్కొన్నారు. అలాంటివి చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చలో ఢిల్లీకి ఎల్ఐసీ ఏజెంట్లు

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ కాలనీలో ఎల్ఐసి కార్యాలయం నుండి భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమైక్య నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏజెంట్లు ఢిల్లీ ధర్నాకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు గాండ్ల నారాయణ మాట్లాడుతూ ఐఆర్‌డిఎ కేంద్ర ప్రభుత్వం భారతీయ జీవిత బీమా అవలంబిస్తున్న మొండివైఖరికి నిరసనగా బుధవారం ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో జరిగే ధర్నాకు వెళ్తున్నామన్నారు. ధర్నాకు బయలుదేరిన వారిలో ప్రధాన కార్యదర్శి పుప్పాల భాస్కర్, కోశాధికారి మూజిగ వినోద్ కుమార్, మాడ చిన్నయ్య, పోతగంటి మల్లేశం, బ్రహ్మవత్ రామారావు, కమతల శ్రీనివాస్, సందు రాజేశ్వర్, కండికే గౌతమ్, పెండెం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



ఆపదలో ఉన్న పేదలకు సేవ చేయడం వరం

- వాసవీ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల్ల రామకృష్ణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆపదలో ఉన్న నిరుపేదలకు సేవ చేయడం ఒక వరం లాంటిదని వాసవి క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల్ల రామకృష్ణ స్పష్టం చేశారు. క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడి అధికార పర్యటనలో భాగంగా మంగళవారం ఆసిఫాబాద్ మండలం యాపాల్పట్టి గ్రామంలో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మారుమూల ప్రాంత ప్రజలకు సేవ చేయడం చాలా సంతోషంగా ఉందని అభిప్రాయపడ్డారు. ఇటువంటి గ్రామాల్లో పాఠశాలలు, దేవాలయాల అభివృద్ధికి వాసవి క్లబ్ తరపున ఆర్థిక సహాయాన్ని అందిస్తామని వెల్లడించారు. దీనిలో భాగంగా ఆ గ్రామంలోని హనుమాన్ ఆలయ అభివృద్ధికి రూ.25000 ఇస్తామని గ్రామ పటేల్‌కు హామీ ఇచ్చారు. వాసవి క్లబ్ అంటేనే క్రమశిక్షణకు మారుపేరని, సేవలో ముందు వరుసలో ఉంటుందన్నారు. ఆసిఫాబాద్ వాసవి క్లబ్ 18 ఏళ్లుగా ప్రతి ఏడాది ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని పలు సేవా కార్యక్రమాలను చేపట్టిందని కొనియాడారు. క్లబ్ సేవలను మరింత విస్తృతపరిచి నిరుపేదలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలకు బట్టలు, చిన్నారులకు పుస్తకాలు పలకలు పంపిణీ చేశారు. అంతర్జాతీయ అధ్యక్షుడి అధికార పర్యటనలో భాగంగా డీఎంహెచ్‌ఓ సీతారాం కృషి మేరకు గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనంలో గ్రామ ప్రజలతో కలిసి భోజనాలు చేశారు. అంతకుముందు అంతర్జాతీయ క్లబ్ అధ్యక్షుని ఆదివాసుల సంస్కృతి సంప్రదాయాల నడుమ గుస్సాడి బృందంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అంతర్జాతీయ, జిల్లా సభ్యులు కిషోర్, వెంకటేష్, వంశీ, లావణ్య, ముక్త శ్రీనివాస్, రేణిగుంట శ్రీనివాస్, ఎక్కిరాల శ్రీనివాస్, బాల సంతోష్, గంధం శ్రీనివాస్, చిలివేరి వెంకటేశ్వర్లు వేణు, గుండా ప్రమోద్, ఆసిఫాబాద్ వాసవి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పాత శ్రీనివాస్ ముక్క కృష్ణమూర్తి, కోశాధికారి కిషోర్, ఆర్యవైశ్యులు, గ్రామ పటేళ్ల ఆత్రం రాజు, భీంరావ్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు స్థిర వేతనం చెల్లించాలి




నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం స్థిర వేతనాన్ని చెల్లించాలని, దానికి సంబంధించి ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. మండల డిప్యూటీ తహసీల్దార్ పోచయ్యకు ఆశావర్కర్లతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18,000 స్థిర వేతనం నిర్ణయించాలన్నారు. ప్రమోషన్, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నగరం పద్మా, ఆశా జిల్లా నాయకులు అనిత, పంచశీల, భారతీ, నవీన, పంచశీల పాల్గొన్నారు.

దహెగాం : ఆశా కార్యకర్తల న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కవితకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తల మండలాధ్యక్షురాలు శోభ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు రూ.18000 వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేషనల్ మార్ట్‌లో రూ.4లక్షలకుపైగా చోరీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని నేషనల్ మార్ట్‌లో దొంగతనం జరిగింది. మావల పోలీస్‌స్టేషన్ ఎస్ఐ వంగ విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని దస్నాపూర్‌లో గల నేషనల్ మార్ట్‌ను సోమవారం రాత్రి ఎప్పటిలాగే క్లోజ్ చేసి మంగళవారం ఉదయం తెరిచారు. తెరిచి చూసేసరికి లాకర్ పగలగొట్టిన ఉండడాన్ని గమనించిన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఫణిదర్, ఎస్ఐ సిబ్బందితో మార్ట్‌కు చేరుకొని క్లూస్ టీం ద్వారా ఆధారాలను సేకరించారు. పరిసరాలను పరిశీలించి సీసీ ఫుటేజీ చెక్ చేశారు. అంతేకాకుండా సిసి ఫుటేజ్ సంబంధించిన రెండు హార్డ్ డిస్కులు సైతం దొంగలు ఎత్తుకెళ్లారు. రూఫ్ మార్గం ద్వారా లోపలికి వచ్చి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. లాకర్‌ను పగులగొట్టి అందులో ఉన్న రూ.4లక్షల82వేలను ఎత్తుకెళ్లారు. మార్ట్ మేనేజర్ తుకారాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

నిధులొచ్చేనా..?



రాష్ట్ర బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లావాసులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. అక్షర క్రమంలో ముందు వరుసలో ఉన్నా..అభివృద్ధిలో వెనుకబడిన జిల్లాకు పేరుగాంచిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు అవసరంగా మారుతోంది. ముఖ్యంగా జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి దయనీయంగా మారింది. జలాశయాలు నిర్మించినా..కాల్వల నిర్మాణం చేపట్టకపోవడం.. పాత వాటిని ఆధునీకరించకపోవడం వంటి సమస్యల కారణంగా పూర్తిస్థాయిలో సాగు, తాగునీటికి ఉపయోగపడటం లేదు. మరోపక్క జిల్లాలో పుష్కలమైన వనరులు ఉన్నప్పటికి వాటి వినియోగానికి ఒక్క భారీ పరిశ్రమ కూడా లేకపోవడం పెద్ద లోటుగా కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుతో పాటు రైతుభరోసా, రైతుబీమా, చేయూత కింద పింఛన్లు, యువ వికాసం, ఇతరాత్ర సంక్షేమ పథకాలు అమలు చేయాల్సి ఉంది. ప్రభుత్వాలు మారుతున్నా జిల్లా అభివృద్ధిలో మాత్రం మార్పులు కనిపించడం లేదు. ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకోవడంతో తాజా బడ్జెట్‌లో జిల్లాకు వరాలు ప్రకటిస్తారని ఉమ్మడి జిల్లావాసులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న దృష్ట్యా జిల్లాలో అవసరాలపై ప్రత్యేక కథనం..

- ప్రతిపాదనల్లోనే మూలుగుతున్న ప్రాజెక్టులు
- డబ్బులు రాక..ఆధునీకరణ, కాల్వల నిర్మాణంలో జాప్యం
- జిల్లాలో అపార వనరులు ఉన్నా..కనిపించని పరిశ్రమలు
- సంక్షేమం పథకాల కోసమూ ఆతృతగా ఎదురుచూపులు
- నేటి రాష్ట్ర బడ్జెట్‌పైనే ఉమ్మడి జిల్లావాసుల ఆశలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అటు రాష్ట్రానికి ఇటు జిల్లాకు మొండి చేయి కనిపించిన సంగతి తెలిసిందే. నయా పైసా కేటాయించకపోవడంతో ఉమ్మడి జిల్లావాసులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెడుతున్న దృష్ట్యా అందరి దృష్టి దీనిపైనే కేంద్రీకృతమవుతోంది. ఇప్పటికే ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు కొత్తగా నెరవేర్చాల్సిన వాటిపై ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందా..?లేదా అనేది అందరిలో ఆతృత నెలకొంది. గతేడాది బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో అరకొర మాత్రమే జిల్లాకు రాగా.. తాజాగానైనా వాటికి సంపూర్ణ బడ్జెట్ వస్తుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలో వర్షాధారం మీదనే ఆధారపడి 85శాతం మంది వ్యవసాయం చేస్తున్నారు. సాగునీటిని అందించేందుకు ప్రభుత్వాలు జిల్లాలో సుమారు 15 సాగునీటి ప్రాజెక్టుల వరకు నిర్మించాయి. వీటిలో కొన్నింటి నుంచి తప్పితే చాలా వరకు కాల్వలు సక్రమంగా లేకపోవడం.. ఆధునీకరించకపోవడం వంటి కారణాలతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. తుమ్మిడిహేటి, కుప్టి ప్రాజెక్టుల నిర్మాణం, అడ, చనాక-కోర్ట ప్రాజెక్టులకు కాల్వల నిర్మాణం కోసం నిధులు కేటాయింపు లేకపోవడం వంటి సమస్యల కారణంగా వృధాగా ఉంటున్నాయి. ఇలా ఆయా ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం కిందటేడాది రూ.346కోట్లు కేటాయించగా..ఇందులో కేవలం రూ.116కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. జిల్లాలో అన్ని ప్రాజెక్టుల కోసం మరో రూ.1800కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపించారు.

వనరులున్నా సద్వినియోగం సున్నా..!

ఉమ్మడి జిల్లాలో వనరులకు కొదువలేదు. జిల్లాలో ఖనిజ సంపద పుష్కలంగా ఉంది. బొగ్గు, ఇనుము, మాంగనీస్, బంకమట్టి, లాటరైట్, సున్నపురాయి, గ్రానైట్, ఇసుక తదితర ఖనిజాలు ఉన్నా వీటికి అనుబంధ పరిశ్రమలు లేకుండా పోయాయి. ముఖ్యంగా జిల్లాలో భారీ పరిశ్రమలు అంటూ ఒక్కటీ లేకపోయింది. ఆదిలాబాద్‌లో ఉన్న సీసీఐ పరిశ్రమ మూతపడి తుక్కులోకి వెళ్లిపోయే పరిస్థితి ఉంది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి వెంబడి పారిశ్రామిక కారిడార్ నిర్మాణానికి అవకాశం ఉన్నా ప్రభుత్వాలు దృష్టిసారించడం లేదు. గుడిహత్నూర్ ప్రాంతంలో టమాట పంట అధికంగా పండుతున్న దృష్ట్యా ఇక్కడ వాటి అనుబంధ పరిశ్రమ నెలకొల్పాలని రైతుల నుంచి డిమాండ్ వినిపిస్తోంది. ఆహారశుద్ధి యూనిట్లు నెలకొల్పేందుకు అవకాశం ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

సంక్షేమంపై అందరి దృష్టి..!

ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పథకాల అమలులో భాగంగా ఇప్పటికే కొన్నింటిని అమలు చేస్తోంది. మిగితా వాటి కోసం జనాలు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. చేయూత కింద రూ.4వేల పింఛన్లు, రైతుభరోసా కోసం నిధుల కేటాయింపు, రైతుబీమా చెల్లించడంతో పాటు ఆగిపోయిన కొన్ని పథకాలకు నిధులు కేటాయింపు అవసరంగా మారింది. యువవికాసం కింద స్వయం ఉపాధి కోసం రుణాలు అందజేస్తామని ప్రకటించడంతో వీటికి సైతం నిధులు కేటాయింపు కీలకంగా మారింది. ముఖ్యంగా ప్రభుత్వం జిల్లాకు ఓ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇప్పటికే మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు నిధులు కేటాయించినట్లు తెలిసింది. కానీ ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు మాత్రం కేటాయించకపోవడంతో స్థానిక ప్రజల్లో నిరాశ వ్యక్తమవుతోంది. వీటితో పాటు ప్రభుత్వ విద్య బలోపేతానికి అవసరమైన నిధులు బడ్జెట్‌లో కేటాయించాలని ఉపాధ్యాయ, విద్యారంగ మేధావులు కోరుతున్నారు. ముఖ్యంగా వైద్యరంగంలోనూ కీలకమైన వైద్యులు, సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపర్చాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఉమ్మడి జిల్లా అభివృద్ధికి దోహదం చేయాలని జిల్లావాసులు ఆకాంక్షిస్తున్నారు.

గళమెత్తిన అంగన్‌వాడీలు

- కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన
- రోడ్డుపై బైటాయించి నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్వాడీల సమస్యలను అసెంబ్లీలో చర్చించాలని సిఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట 48గంటల మహాధర్నా నిర్వహించారు. సోమవారం ఉదయం ప్రారంభమై మంగళవారం సాయంత్రం వరకు కొనసాగించారు. సోమవారం రాత్రి వంటావార్పు నిర్వహించి ఆటపాటలతో అక్కడే బస చేసి నిరసన తెలిపారు. రెండవ రోజు మంగళవారం దీక్ష శిబిరం నుండి కలెక్టరేట్ గేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ బైటాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దాదాపు గంట పాటు నిరసన తెలిపారు. అనంతరం వారి వద్దకు కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాగా ఆమెకు వినతిపత్రం అందజేసి తమ సమస్యలను విన్నవించారు. అనంతరం 48 గంట మహాధర్నాకు ముగింపు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయివేటీకరణ విధానాలతో ఐసిడిఎస్‌ను క్రమంగా నిర్వీర్యం చేయాలని చూస్తోందన్నారు. ఇందులో భాగంగానే నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని తెచ్చిందని, ఇది అమలు జరిగితే ఐసిడిఎస్‌కు స్వతంత్రంగా ఉండదని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అంగన్వాడీలు ఐసిడిఎస్ పరిరక్షణకు పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తున్నారని, కానీ కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు తగ్గిస్తూ నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని తెలిపారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా గట్టిగా నిలబడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కానీ దుర్మార్గంగా కేంద్రం చేసిన నిర్ణయాలను రాష్ట్రంలో అమలు చేయాలని చూడడం అన్యాయమన్నారు. పీఎంశ్రీ స్కూల్, సంచార అంగన్వాడీ కేంద్రాలను రాష్ట్రంలో ఏర్పాటు చేసి ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేస్తే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, ఎం.గంగన్న, సహాయ కార్యదర్శి ఎస్.నవీన్ కుమార్, నాయకులు దర్శనాల నగేష్, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి.వెంకటమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు డి. సునీత, జే.సుభద్ర, నాయకులు ముక్త, పంచపూల, నర్మద, మల్లికాంబ, నజీమా, లక్ష్మి, భాగ్యశ్రీ, విశాఖ, సంగీత పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకంగా ఐసిడిఎస్ రక్షణ, హక్కుల సాధన కోసం జిల్లా కేంద్రాల్లో 48 గంటల ధర్నాలో భాగంగా నిర్మల్‌లోనూ వంటావార్పు చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడుతూ వేతనాలను ప్రతి నెలా 1న చెల్లించాలని, కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన రూ.18,000 వేతనం, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, మినీ టీచర్స్ 10 నెలల బకాయి వేతనాలు చెల్లించి, హెల్పర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఎండాకాలంలో ప్రభుత్వ పాఠశాలతో సమానంగా ఒకపూట బడి, మే నెలంతా టీచర్స్, హెల్పర్స్‌కు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ఆదిలాబాద్‌లో కలెక్టరేట్ ఎదుట బైటాయించిన అంగన్‌వాడీలు


ఆదిలాబాద్ కలెక్టరేట్‌కు ర్యాలీగా...



నిర్మల్‌లో బైటాయించిన అంగన్‌వాడీలు


నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందజేత

వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

నిర్మల్ : వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి హామీ కూలీలకు ఉపాధి కల్పన, ఇతర అంశాలపై సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు తాగు నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు షెడ్యూల్ ప్రకారం ట్యాంకర్ల ద్వారా ప్రతి రోజూ తాగు నీటిని అందించాలన్నారు. బస్టాండులు, ప్రధాన కూడళ్లు, జనసంచారం అధికంగా ఉన్న ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడివోలు, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు సంయుక్తంగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని, తాగు నీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. పశువులకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన చోట చేతి పంపులు, బోరు బావులకు మరమ్మత్తులు చేయాలన్నారు. తాగు నీటి వృధాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నమూనా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అనువైన స్థలాల గుర్తింపును వెంటనే పూర్తిచేయాలన్నారు. ఎండలు అధికంగా ఉన్నందున ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాలలో టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం పలు రెవెన్యూ అంశాలపై కలెక్టర్ మాట్లాడుతూ మండలాల పరిధిలోని ధరణి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పలు పౌరసేవల ధ్రువీకరణ పత్రాల వివరాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, జెడ్పి సిఈఓ గోవింద్, అన్ని మండలాల తహసీల్దార్‌లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు పాల్గొన్నారు.



మహిళా కమిషన్ సభ్యురాలు సఖీ కేంద్రం తనిఖీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్రం ఈశ్వరిబాయి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రిజిస్టర్లను పరిశీలించి ఇది వరకు నమోదైన కేసుల వివరాలను సఖి కేంద్రం నిర్వాహకురాలు మమతని అడిగి తెలుసుకున్నారు. సఖి ద్వారా మహిళలకు అందించే సేవలపై ఆరా తీశారు. సఖీ కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, బాధితులకు ఏదైనా సహాయం కావాలన్న వారికి సత్వరంగా అందించాలని తెలిపారు. ప్రధానంగా ప్రతి మండలంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. బాధిత మహిళల రక్షణ కోసం వారి సమస్యల పరిస్కారం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. అనంతరం సఖీ కేంద్రానికి వచ్చే మహిళలకు ఇచ్చే కిట్‌ను, వసతి సౌకర్యాలను పరిశీలించారు. ఈశ్వరిబాయిని సఖీ సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఆమె వెంట జీసిడివో శకుంతల, సఖీ సిబ్బంది మమత, సుమలత, రమేష్, సత్యశీల ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
2
బుధవారం | మార్చి 19, 2025 | www.navatelangana.com

కుష్టు వ్యాధి అనుమానితుల సర్వే

నవతెలంగాణ-ఉట్నూర్



మండల కేంద్రంలోని శ్యాంపూర్, ఇంద్రవెల్లి, సట్వాజి గూడ గ్రామాలతో పాటు పలుకాలనిలో కుష్టు వ్యాధి సర్వేను మంగళవారం జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, ప్రోగ్రాం అధికారి డాక్టర్ గజానన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీ వైద్యాధికారులు సందీప్, శ్రీకాంత్, డిప్యూటీ పారా మెడికల్ అధికారులు వామన్‌రావు, రమేష్, ఆరోగ్య పర్యవేక్షకులు నూర్‌సింగ్, సురేష్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నహీముల్లా ఖాన్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



జిల్లా కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా పట్టణంలెపె నగరేశ్వర్‌వాడకు చెందిన న్యాయవాది నహీముల్లా ఖాన్ నియమితులయ్యారు. మంగళవారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు మర్యాద పూర్వకంగా కలసి ఏజీపీను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో ఏఎంసీ చైర్మన్ భీంరెడ్డి, పోశెట్టి, అబ్దుల్ హాది, న్యాయవాది రవి కుమార్, నాయకులు అతిక్ అహ్మద్, సంతోష్ ఉన్నారు.

బడ్జెట్ సమావేశాల్లో చర్చించి పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలు ఎదుర్కొంటున్న సమస్యలపైన చర్చలు జరిపి పరిష్కారం కోసం కార్యచరణ రూపొందించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. లేనిపక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని పేర్కొన్నారు. మంగళవారం డీఎంహెచ్‌ఓ డా.నరేందర్ రాథోడ్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ సాధనను కలిసి ఆశాల సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రూ.18,000 స్థిర వేతనం నిర్ణయించాలన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని, సమ్మె కాలపు హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలకు మేనిఫెస్టోలో చేర్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశాలకు ఏఎన్ఎం పోస్టుల్లో ప్రమోషన్ కల్పించాలని వెయిటేజీ మార్కులు వెంటనే నిర్ణయించాలని, రూ.50 లక్షల ప్రమాద భీమా సౌకర్యాన్ని అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ. ఐదు లక్షలు చెల్లించాలని, వేతనంలో సగం పెన్షన్ రూపంలో చెల్లించాలన్నారు. ఈ సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించడానికి ఆశాలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి సుజాత, నాయకులు లత, ఆశ, అనిత పాల్గొన్నారు.

నియోజకవర్గంలో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి

- శాసనసభలో గళం విప్పిన ఎమ్మెల్యే రామరావ్ పటేల్

నవతెలంగాణ- నిర్మల్



నియోజకవర్గంలో గతంలో భారీ వర్షాలతో వంద చెరువులు దెబ్బతిన్నాయని, దీంతో భూగర్భజలాలు అడుగంటి పోయాయని ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, చెరువుల మరమ్మతులకు నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ కోరారు. జీరో అవర్‌లో శాసనసభలో ఆయన నియోజకవర్గ సమస్యలపై గళమెత్తారు. చెప్పులు అరిగేదాకా మంత్రుల చుట్టూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. హిప్‌నెల్లి చెరువు మరమ్మతులకు రూ.60 లక్షలు, దొడర్న చెరువుకు రూ. 90 లక్షలు నిధులు మంజూరైనప్పటికీ ఇప్పటివరకు ఫైనాన్స్ క్లియరెన్స్ కావడం లేదన్నారు. మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు పంచాయతీరాజ్ రోడ్డును 100 మీటర్లు తవ్వేశారని, అధికారం ఉందని ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని, ఈ విషయంలో దష్టి సారించి చర్యలు చేపట్టాల్సిందిగా కోరారు.పలుమార్లు బాసర అభివృద్ధిపై మాట్లాడుతుంటే ప్రభుత్వంలో చలనం రాకపోవడం బాధాకరమన్నారు. త్వరలో గోదావరి పుష్కరాలు వస్తున్నాయని పనులను ప్రారంభించాలని అసెంబ్లీ సాక్షిగా ఆయన కోరారు. ప్రభుత్వం ఇవ్వకపోతే దాతల సహకారంతో ఆలయాన్ని అభివద్ధి చేసుకుంటామని, దీనికోసం అనుమతి ఇవ్వాలన్నారు. వసంత పంచమి వేళ గోదావరి నది ఘాట్ల వద్ద రెండు లక్షల మంది పుణ్య స్నానమాచరిస్తే ఏర్పాట్లు లేక భక్తులు ఇబ్బందులు పడ్డ విషయాన్ని గుర్తు చేశారు. దీంతో సంబంధిత శాఖ మంత్రి ప్రభుత్వ దష్టికి సమస్యను తీసుకువస్తామని నోట్ చేసుకుంటున్నట్లు చెప్పారు.

బిట్ల చైతన్యకు సన్మానం

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన బిట్ల పెద్ద గంగన్న కుమారుడు బిట్ల చైతన్య హాస్టల్ వెల్ఫేర్‌లో ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద గ్రంథాలయంలో మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి గ్రామస్తులు మంగళవారం ఘనంగా సన్మానించారు. గత సంవత్సరం గోక గణేష్ రెడ్డి రూ.50,000 వేలు దాతలు ఇచ్చిన సహకారంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని అప్పటి కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో ప్రారంభించిన గ్రంథాలయంలో చదివి చైతన్య ఉద్యోగం సాధించాడు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతారెడ్డి, గోనెల గంగన్న, బిట్ల చిన్న గంగన్న, కరోబార్ సంజీవరెడ్డి, కాంతారావు, వెంకటేష్ యాదవ్, ఎన్.అశోక్, లోక ప్రవీణ్ రెడ్డి, గాజుల సాంబశివ్, గొక ప్రకాష్ రెడ్డి, గోక దేవారెడ్డి, గంగారెడ్డి, ఉత్తం, మోహన్, మల్లేష్, బైండ్ల సుభాష్, సాయి కిరణ్, మహేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వామనస్వామి పట్టాభిషేక మహోత్సవాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 19, 20వ తేదీల్లో పట్టణంలో ఆర్యవైశ్యుల కుల గురువు, వామనాశ్రమ పీఠాధిపతి వామనస్వామి పట్టాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కొత్తవార్ రాజేశ్వర్, కొత్త హరీష్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. స్వామి వారి రాక సందర్భంగా ఈ నెల 19న గోపాలకృష్ణమఠం నుండి కన్యక పరమేశ్వరి ఆలయం వరకు స్వాగత శోభాయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే 20న వాసవి మాత ఆలయంలో స్వామివారి పట్టాభిషేకం, హోమ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు డెబ్బది ఉల్లాస్, పత్తి ప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి



సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

త్రాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తాగునీటి కార్యాచరణ ప్రణాళిక, భూగర్భ జలమట్టం మెరుగుదల చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా తాగునీటి సమస్యలపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. స్థానికంగా ఉన్న నీటి వనరులు, బోరు బావులను గుర్తించాలని, ప్రజలకు నీటిని సంరక్షించే అవసరాలపై అవగాహన కల్పించాలన్నారు. నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. అత్యవసర సమయాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, నీటి సరఫరాపై సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించాలన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో నీటి సమస్యను గుర్తించి వెంటనే నివేదిక అందించాలన్నారు. ప్రతి గ్రామం, బస్తీ, మున్సిపల్ వార్డులో తాగునీటి సరఫరా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. నీటి లీకేజీలను ఎప్పటికప్పుడు నియంత్రించేల పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న తాగునీటి పంపులు, బోరు బావుల మరమ్మత్తు పనులు ఎప్పటికప్పుడు చేయాలని సూచించారు. ఆదిలాబాద్ రూరల్, ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి, గాదిగూడ, సిరికొండ, బజార్‌హత్నూర్‌లోని క్రిటికల్ హాబిటేషన్‌లో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పంప్ హౌస్, బోర్ వెల్స్, బావులు, మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలను వెంటవెంటనే గుర్తించి మరమ్మత్తులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

ఉపాధి హామీ కూలీలకు రక్షణ కల్పించాలి

వేసవిలో ఎండల తీవ్రత మరీ రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలకు ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు పనులు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో రక్షణ కల్పించేందుకు ఉపాధి పథకంలో వాటర్ బెల్ విధానాన్ని అమలుచేయాలన్నారు. పనులకు హాజరయ్యే కూలీలకు గంటకోసారి నీరు తాగేలా పని ప్రదేశంలో ఏర్పాట్లు చేయాలన్నారు. నీడనిచ్చే షెడ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్స్, సరైన మందుల కిట్ అందుబాటులో ఉంచాలన్నారు. వేసవి కాలం వెళ్లేంతవరకు ఈ నాలుగు నెలలు పని ప్రదేశంలో వారికి వసతులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ, డీఆర్డీఓ, డీపీఓ, డీఎల్పీఓ, జేడీఏ, డీడీ, భూగర్భ జలశాఖ, ఎంపీఓలు పాల్గొన్నారు.

సీసీఐ పునఃప్రారంభానికి నిధులు కేటాయించాలి

- నేటి నుండి రిలే నిరాహార దీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



సమావేశంలో మాట్లాడుతున్న సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ మల్లేష్

పార్లమెంట్ సమావేశాల్లోనే సీసీఐ పున్షప్రారంభానికి నిధులు కేటాయించాలని సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో సాధన కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ మల్లేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పరిశ్రమను పునర్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను గెలిపించిన జిల్లాను అభివృద్ధి చేయడానికి ప్రయత్నించకపోవడం బాధాకరమని అన్నారు. సీసీఐ పరిశ్రమను పునర్ ప్రారంభించాలని ఒకవైపు జిల్లా ప్రజలు పోరాడుతుంటే, బీజేపీ ప్రభుత్వం మరోవైపు తుక్కుకింద అమ్మేయడం కోసం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. సీసీఐ సాధన కోసం మలిదశ ఉద్యమాన్ని బుధవారం నుండి ప్రారంభించనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్ ఎదుట దీక్షలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సీసీఐ సాధించేవరకు ఉద్యమిస్తామన్నారు. ఈ సాధన కమిటీలో కోకన్వీనర్లుగా వెంకట్ నారాయణ(న్యూడెమోక్రసీ), ఆర్.రమేష్(బీఎస్పీ), అగ్గిమల్ల గణేష్(డిఎస్పీ)ని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీఐ సాధన కమిటీ కోకన్వీనర్ విజ్జగిరి నారాయణ, లంక రాఘవులు, అరుణ్ కుమార్, లోకారి పోశెట్టి, జగన్ సింగ్, ఈశ్వర్ దాస్ పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు



ఖానాపూర్ : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

నవతెలంగాణ-ఖానాపూర్

అక్రమ కేసులకు భయపడేదిలేదని ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకొని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం పై పోరాడుతామని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయడం పిరికిపంద చర్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరిట నియంత పాలన కొనసాగిస్తుందన్నారు. శాసనసభలో కాంగ్రెస్ అప్రజాస్వామిక విధానాలపై పార్టీ ఆధ్వర్యంలో ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో దిష్టిబొమ్మ దహనం చేశారు. కాంగ్రెస్ నాయకులు పోలీసులపై ఒత్తిడి చేసి బీఆర్ఎస్ నాయకుల పైన బలవంతపు అక్రమకేసులు బనాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రి ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసిన వారిపై కూడా పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతుందని అక్రమ కేసులకు అదిరేది బెదిరేది లేదని అన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజ గంగన్న, రామునాయక్, ప్రదీప్ గజేందర్, సుమిత్, గౌరీకర్ రాజు, చింటూ, మహేందర్, ఉన్నారు.

ఉట్నూర్ : ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ధర్నాలు, నిరసనలు నిషేధిస్తూ వీసీ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో మంగళవారం ఉట్నూర్‌లో ఉదయం బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ఇందులో మొహమ్మద్ ముజీబ్, క్రాంతి కుమార్, బాబా శ్యామ్ టైగర్, సాజిద్,పొన్నం సాయి, సుమన్ ఉన్నారు. ఈ సందర్భంగా ధరణి రాజేష్ మాట్లాడుతూ నాడు ఇదే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, బీఆర్ఎస్వీ నాయకులు చేసిన తెలంగాణ ఉద్యమ పోరాటం, అక్రమ అరెస్టుల ముందు, ఆనాటి ముఖ్యమంత్రి బెదిరింపులను సైతం లెక్క చేయలేదన్నారు.

కులగణన చేసిన ఘనత కాంగ్రెస్‌దే..

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశంలో ఏ రాష్ట్రం చేపట్టని విధంగా ప్రతిష్టాత్మకంగా కులగణన చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగం, రాజకీయాలలో 42 శాతం రిజర్వేషన్ కల్పించి వారికి పెద్దపీట వేసిందన్నారు. అటు రాజీవ్ యువ వికాసంతో యువతకు ఎంతో మేలు చేకూరుతుందని, రూ.50 వేల నుండి 5 లక్షల వరకు ఆర్థికసాయం అందుతుందని తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో కులగణన జరిగిందన్నారు. బీసీలకు సముచిత స్థానం కల్పించాలనే సంకల్పంతో మంచి ఆలోచన దృక్పథంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకుసాగుతోందన్నారు. అదేవిధంగా ఎస్సీ, బీసీలను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చారిత్రాత్మక నిర్ణయాలు అభినందనీయమని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి కృషి చేస్తామని సీయం అసెంబ్లీలో ప్రకటించడం గర్వకారణమన్నారు. ఇటు ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే భూముల కబ్జాలపర్వం కొనసాగుతోందన్నారు. త్వరలోనే ఎమ్మెల్యే పాయల శంకర్ భూకబ్జాలను ఆధారాలతో సహా బయట పెడతానన్నారు. అటు రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ వ్యవహారంలోనూ పాయల శంకర్, జోగు రామన్నల తీరు ఒకటేనన్నారు. డబ్బులు దండుకోవడమే నైజం అని విమర్శించారు. ఇద్దరు కలిసి మళ్లీ ఆదిలాబాద్ ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు.సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీని తెరిపించడంలో ఎంపీ, ఎమ్మెల్యే విఫలమయ్యారన్నారు. వారిని గెలిపించిన పాపానికి ప్రజలు బాధలు పడుతున్నారన్నారు. అసెంబ్లీ సమావేశాల సాక్షిగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఇటీవల మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ వారి ఫ్లెక్సీని దహనం చేశారు.

సీఎం, సీతక్క ఫ్లెక్సీలకు పాలాభిషేకం

సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం సాహసోపేత, చారిత్రాత్మక నిర్ణయాలతో ప్రజల మెప్పుపొందుతోందని, మరింత చేరువవుతోందని కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. బీసీల రిజర్వేషన్ 42 శాతం పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడం శుభ పరిణామమని, హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. అలాగే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం తెలిపడం, దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపడంపై హర్షం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క ఫ్లెక్సీలకు మంగళవారం క్యాంపు కార్యాలయం, ప్రజాసేవా భవన్ వద్ద పాలాభిషేకం చేసి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్ గౌడ్, మావల ఎంపీపీ దర్శనాల ఏవన్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, బండారి సతీష్, సంద నర్సింగ్, ఆవుల వెంకన్న ఉన్నారు.



స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేయాలని డీఈఓ ప్రణీత అన్నారు. మంగళవారం ప్రగతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ అవగాహన శిబిరానికి ఆమె హాజరయ్యారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ నిర్వహించే కార్యక్రమాలు ఇచ్చే శిక్షణాలు తదితర వాటి గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా దృక్పతం పెంపొందించడంలో కీలక పాత్రను స్కౌట్స్ అండ్ గైడ్స్ పోశిస్తుందన్నారు. ఈ సందర్భంగా భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వకులాభరణం ఆదినాథ్ మాట్లాడుతూ దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక సేవా దృక్పథాన్ని పెంపొందించే స్కౌట్ ఉద్యమంలో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు చేరేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అదే విధంగా స్కౌట్స్ ల్యాండ్‌లో ప్రహరీ నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యే నిధులను కేటాయించేల తన వంతుగా పూర్తి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కాంచనపల్లి రత్నకార్, జిల్లా కార్యదర్శి ఎస్.స్వామి, కోశాధికారి కన్నం మోహన్ బాబు, జాయింట్ సెక్రటరీ లక్ష్మీ, జిల్లా శిక్షణ కమిషనర్ నాగిరెడ్డి, మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు దత్తు, లక్ష్మీ, జీవిత పాల్గొన్నారు.

మావల హక్కుల సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా చైర్మన్‌గా బైండ్ల శ్రీనివాస్ నియామక అయ్యారు. ఈ మేరకు జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర చైర్మన్ ఎంఏ సలీం ఆదేశాల మేరకు వైస్ చైర్మన్ సయ్యద్ హైదర్ సమక్షంలో ఆయనకు మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు తన శాయశక్తుల కషి చేస్తానన్నారు. ఆయన వెంట సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ఉన్నారు.

జిజ్ఞాసలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు జిజ్ఞాస రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలిచారు. ఈ నెల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రభుత్వ పాలన శాస్త్రంలో ఆరు గ్యారంటీల అమలుకు అవకాశాలు ఆదిలాబాద్‌పై ఒక అధ్యయనం అనే అంశంపై పరిశోధనలు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రస్థాయి పోటీలలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. గోపాల్ ఆధ్వర్యంలో బీఏ విద్యార్థులు ఆర్యన్, నవదీప్, ఆశిష్, దిశాశర్మ వైష్ణవి సుకన్య పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బేగం పర్యవేక్షకుణ్ణి, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతి రఘు, సిబ్బంది పాల్గొన్నారు

ఆటల పాటలతో అలరించిన విద్యార్థులు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆటలు పాటలతో విద్యార్థులు అలరించారు. మంగళవారం స్థానిక జెడ్పీ పాఠశాల వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఆరంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు తెలిపారు. ఇందులో ఎంఈఓ మనుకుమార్, హెచ్ఎం రామ్మోహన్, ఉపాధ్యాయులు బండి సుభాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల వీడ్కోలు వేడుకలు

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని నర్సాపూర్(బి) బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాథోడ్ ప్రకాష్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ వారి భవిష్యత్తు గురించి మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి. ఈ వేడుకలో విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పోలీస్ కుటుంబాలలకు అన్నివిధాల అండగా ఉంటామని ఎస్పీ డీవి శ్రీనివాసరావు తెలిపారు. ఈస్గాం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించి ఇటీవల అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ ఎండి బషిరుద్దీన్ కుటుంబ సభ్యులకు కోఆపరేటివ్ సొసైటీ ద్వారా అందించే రూ.2,20,000 చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల కుటుంబాలకు ఎప్పుడు అండగా ఉంటామని తెలిపారు. మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి రావాల్సిన బెనిఫిట్స్ త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య జిల్లా పోలీస్ కో ఆపరేటివ్ సొసైటీ కోఆర్డినేటర్ జఫరుద్దీన్, ఆర్ఐ ఎంటీ అంజన్న పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో ముందుకెళ్లాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



విద్యార్థులు ప్రణాళికతో చదువుల్లో ముందుకెళ్లాలని, ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎంపీడీఓ అల్బర్ట్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవం, పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. మంగళవారం పాఠశాల హెచ్ఎం విజయనిర్మల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పదవ తరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాయాలని, 100శాతం ఉత్తీర్ణత సాధించేలా చదవాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. పాఠశాల నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రమేష్ బాబు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఓటర్ జాబితా రూపకల్పనకు సహకరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాజకీయ పార్టీలు ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలని ఆర్డీఓ లోకేశ్వరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణలలో భాగంగా ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమం 2025లో భాగంగా పేర్ల నమోదు, పేరు సవరణ, మార్పులు, చేర్పులు, తొలగింపులకు ఫారం 6, 7, 8లను సమర్పించాలన్నారు. ఓటరు జాబితా చిరునామా మార్పుకు ఫారం 8ని సమర్పించాలని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు జాబితా సవరణలపై గ్రామాలలో అవగాహన కల్పించాలని సూచించారు. అర్హత గల ఓటర్లు అందరూ ఒకే ప్రాంతంలో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కళాజాత బృందంతో అవగాహన



నవతెలంగాణ-తిర్యాణి

నాబర్డ్ సౌజన్యంతో ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యత కార్యక్రమంలో మంగళవారం మండలంలోని కన్నెపల్లి, గోయగాం, గ్రామాల్లో శ్రీనిధి ప్రత్యేక డిపాజిట్‌పై కళాజాత బృందంతో ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంక్ మేనేజర్ రవి కిరణ్ మాట్లాడుతూ జిల్లా సహకార బ్యాంకులో ఇప్పుడు రైతులకు అనేక విధాలలోను సౌకర్యాలతో పాటు పొదుపు కార్యకలాపాలను చేపడుతున్నట్లు తెలిపారు. మండల రైతులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా సహకార బ్యాంక్ తిర్యాణి బ్రాంచ్‌లో శ్రీనిధి ప్రత్యేక డిపాజిట్ పథకం ప్రారంభమైందని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి భగవంరావుత్ రావు, మాజీ సర్పంచ్ మమతా మొగిళి, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ హేమంత్, కళాజాత బృంద నాయకులు వై.రమేష్, పీఏసీఎస్ కార్యాలయ, బ్యాంక్ సిబ్బంది, గ్రామ పటేళ్ల, రైతులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో పెండింగ్ పనులు పూర్తి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోవలక్ష్మి జీరో అవర్‌లో నియోజకవర్గం సమస్యలపై గలమెత్తారు. నియోజకవర్గంలోని గుండి వాగు బ్రిడ్జి కొన్ని సంవత్సరాల నుండి కొనసాగుతుందని, నిర్మాణ కాలం పెరగడంతో ఎస్టిమేట్స్ పెరుగుతున్నాయన్నారు. ప్రస్తుత సంవత్సరం వర్షాకాలం ప్రారంభనాటికి బ్రిడ్జి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కెరమెరి మండలం లక్మాపూర్ బ్రిడ్జిలు పూర్తి చేయడంతో పాటు ఆదిలాబాద్ వెళ్లే ప్రధాన రహదారి సింగిల్ రోడ్డుగా ఉందని దీనిని వెడల్పు చేసి ప్రజల కష్టాలు తీర్చాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్టీసీ డీఎం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన కేవీ రాజశేఖర్ మంగళవారం కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎస్పీ డివి శ్రీనివాసరావు, జిల్లా రవాణ శాఖ అధికారి రామచంద్ర నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా రవాణా సంస్థను సక్రమంగా నడుపుతూ ప్రజల మన్ననలు పొందాలని డీఎంకు సూచించారు.

నూతన డిఎంను సన్మానించిన కార్మిక సంఘాలు

డిపోకు కొత్తగా వచ్చిన మేనేజర్ రాజశేఖర్‌ను ఎంప్లాయిస్ యూనియన్, ఏఐటీయూసీ, సీసీఐ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ డిపో సెక్రెటరీ దివాకర్, ప్రెసిడెంట్ అశోక్, అసిస్టెంట్ సెక్రటరీ సురేష్, అసిస్టెంట్ సెక్రటరీ శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకులు పిడుగు శంకర్, సీపీఐ నాయకులు ఆత్మకూరి చిరంజీవి, ఏఐవైఎఫ్ నాయకులు ధర్మి రాకేష్ పాల్గొన్నారు.

24 నుండి వాలీబాల్ టోర్నమెంట్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 24 నుండి కౌటాల మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ డివి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ తమ గ్రామాల నుండి ఒక్క టీంని ఏర్పరచుకొని టీంకి సంబంధించిన వివరాలను ఈ నెల 22లోపు 84669 43511 (కౌటల పోలీస్ స్టేషన్) నెంబర్‌కి కాల్ చేసి తెలపాలన్నారు.

పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలో 6421 మంది విద్యార్థులు
- 21 నుండి పరీక్షలు ప్రారంభం



పదో తరగతి పరీక్షలపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ (ఫైల్)

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పదవ తరగతి విద్యార్థులకు ఈ నెల 21 నుండి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు ఏప్రిల్ 2 వరకు జరగనున్నాయి. ఇప్పటికే జిల్లాలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 6421 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరి కోసం మొత్తం 36 సెంటర్లను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో కొన్నిచోట్ల వసతులు సరిగా లేకపోయిన ఉన్నదాంట్లో విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించారు. మొదటిసారి పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రత్యేక కథనం.

జిల్లాలో పరీక్షలు రాయనున్న 6421 మంది

జిల్లాలో మొత్తం 6421 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా వీరిలో 2894 మంది బాలురు, 3527 మంది బాలికలున్నారు. వీరి కోసం మొత్తం 36 సెంటర్లను ఏర్పాటు చేశారు. వీటిలో 2 ప్రయివేట్ పాఠశాలల సెంటర్లు, 2 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 32 ప్రభుత్వ పాఠశాలల్లో సెంటర్లు ఏర్పాటు చేశారు. వీరి కోసం మొత్తం 36 మంది చీఫ్ సూపరింటెండెంట్స్, 36 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 2 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, పోలీస్ స్టేషన్‌కు దూరంగా ఉన్న మూడు కేంద్రాలు మోడీ, మహాగావ్, గంగాపూర్ గుర్తించి ప్రత్యేక కస్టోడియంలను ఏర్పాటు చేశారు.

ఈ నెల 21 నుండి పరీక్షలు ప్రారంభం

పదో తరగతి పరీక్షలకు మొత్తం ఏడు పేపర్లు ఉండగా ఈ నెల 21 నుండి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 2వ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఉదయం 9.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12.30 నిమిషాల వరకు పరీక్ష ఉంటుంది. సమయం కంటే ముందే విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలని సూచిస్తున్నారు.

ఫలితాలలో మెరుగుదలకు ఉపాధ్యాయుల ప్రయత్నం

గతేడాది కుమురం భీం జిల్లా రాష్ట్రంలో 31వ స్థానంలో నిలిచింది. అయితే ప్రస్తుతం జరుగుతున్న పరీక్షల్లో దీనిని అధిగమించడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికోసం డిసెంబర్ 10 నుండి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. గిరిజన, ఇతర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులను పూర్తిస్థాయిలో సిద్ధం చేశారు. మెరుగైన ఫలితాల సాధన కోసం ఉపాధ్యాయులు శ్రమించారని చెప్పవచ్చు.

ఒక్క నిమిషం నిబంధన వర్తించదు

ఇంటర్మీడియట్ పరీక్షలకు కాంపిటేటివ్ పరీక్షల వలనే ఒక్క నిమిషం నిబంధన మొదట అమల్లో ఉన్నప్పటికీ, 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మొదటినుండి పరీక్ష సమయానికి ఐదు నిమిషాల వరకు కూడా అనుమతించనున్నట్లు అధికారులు తెలిపారు. సెల్ ఫోన్ ఫ్రీ జోన్‌గా సెంటర్ ఉండాలని ప్రభుత్వం నిర్ణయం మేరకు అధికారులు విద్యార్థులు ఎవరు కూడా సెల్ ఫోన్లు తీసుకురాకూడదని ఆదేశాలు జారీ చేశారు.

పకడ్బందీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



ఉదయ బాబు, జిల్లా పరీక్షల సహాయ సంచాలకులు

పరీక్షల పకడ్బందీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్ష సమయంలో 144 సెక్షన్ కేంద్రాల వద్ద అమలులో ఉంటుంది. జిరాక్స్ సెంటర్లు తెరిచి ఉంచకూడదు. ఎలక్ట్రానిక్ వస్తువులు సెంటర్‌లోనికి అనుమతించబోము. విద్యార్థులకు పరీక్ష సమయం తర్వాత ఐదు నిమిషాల వరకు లోనికి వచ్చే అవకాశం ఉంటుంది.

పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

యాదయ్య, జిల్లా విద్యాధికారి



జిల్లాలో జరిగే పరీక్షలకు మొత్తం 6421 మంది పరీక్ష రాయనున్నారు. వీరి కోసం మొత్తం 36 సెంటర్లు ఏర్పాటు చేశాం. వారందరికీ కావాల్సిన వసతులు ఏర్పాటు చేయాలని ఇప్పటికే ఆయా సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాం. విద్యార్థులకు సాధ్యమైనంత వరకు ఎక్కడ కూడా కష్టం కలగకుండా పరీక్ష రాయడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. దూరప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాలకు చేరడానికి ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలించాం.

గిరిజన హాస్టల్ వర్కర్ల సమ్మె విరమణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని గిరిజన హాస్టల్స్‌లో పనిచేస్తున్న కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ఏడు రోజులుగా విధులు బహిష్కరించి కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న నేపథ్యంలో డీటీడీఓ రమాదేవి సమ్మె శిబిరానికి చేరుకొని సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ గెజిట్ ద్వారా వేతనాలు ఇచ్చేలా చూస్తానని తెలిపారు. వేసవి సెలవుల్లో వేతనాలు చెల్లించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని అన్నారు. దీంతో పాటు ఇతర సమస్యలు కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు క్రిష్ణమాచారి మాట్లాడుతూ జిల్లా అధికారి సమస్యల పరిష్కారం కోసం హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా సమ్మె విరమిస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్తులో మరో ఆందోళనకు సిద్ధమవుతామన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అధికారిణికి అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజేందర్, ముంజం శ్రీనివాస్, తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, డైలీ వేజ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్, యూనియన్ జిల్లా కార్యదర్శి మెస్రం సీతారాం, ఉపాధ్యక్షులు వసంత్ రావ్, రాంబాయి, అరిగేల కోటయ్య, శ్యామల, ఇందు, యూనియన్ జిల్లా నాయకులు పద్మ, నాగేశ్వరి, రమేష్, తార, రమేష్, పతుబాయి, లక్ష్మీ, రాంబాయి, మామిడి లక్ష్మి, క్రిష్ణ, శివరాం పాల్గొన్నారు.

బోర్డు పరీక్షలను పక్కాగా ఎదుర్కోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 21 నుండి ప్రారంభం కానున్న పదో తరగతి బోర్డు పరీక్షలను పక్కాగా ఎదుర్కోవాలని ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు సీఐ రవీందర్‌తో కలిసి పరీక్ష సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి, తపన, పట్టుదల, సమయ పాలన విజయానికి ముఖ్య సూత్రాలు అవుతాయన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. ఆ పట్టుదలతో ఇప్పుడు తను ఆసిఫాబాద్ జిల్లాకు ఏఎస్పీగా పని చేస్తున్నానన్నారు. దీనంటికి చదువే ప్రధాన కారణమని వివరించారు. చదువు జ్ఞానాన్ని పెంచుతుందన్నారు. ప్రతీ ఒక్కరు గొప్ప లక్ష్య సాధనకై ఆలోచన చేయాలన్నారు. లక్ష్యం సాధించడానికి ఒత్తిడిని అధిగమించి ముందుకు వెళ్లాలని సూచించారు. తన మీద తనకు నమ్మకం ఏర్పడ్డప్పుడే అనుకున్నది సాధించగలుగుతారని అన్నారు. విద్యార్థులు ఎటువంటి భయం ఒత్తిడి లేకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుభాష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ నిర్వీర్యం చేసే కుట్ర మానుకోవాలి

- సీఐటీయూ జిల్లా నాయకులు
- విజయవంతమైన మహాధర్నా



అంగన్‌వాడీల ధర్నా ముగింపులో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే దిశగా చేస్తున్న కుట్రను మానుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు అండగా ఉండాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజేందర్, ముంజం శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండు రోజుల పాటు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించిన మహాధర్న ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఐసీడీఎస్ నిర్వీర్యం చేసే విధంగా వచ్చిన పీఎంశ్రీ మొబైల్ పాఠశాలలు రద్దు చేయాలన్నారు. అంగన్‌వాడీలకు ప్రతినెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలన్నారు. కనీస వేతనం రూ.18,000గా నిర్ణయించాలని కోరారు. మినీ అంగన్‌వాడీ టీచర్లకు పెండింగ్‌లో ఉన్న పదినెలల వేతనాలు చెల్లించాలన్నారు. మంత్రి సీతక్క గతంలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ విరమణ మొత్తాలు పెంచాలన్నారు. ఎండాకాలంలో ప్రభుత్వ పాఠశాలలకు ఇచ్చినట్లు అంగన్‌వాడీలకు కూడా సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్లకు సంబంధించి ప్రస్తుత బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకోవాలని అప్పుడే పేద విద్యార్థులకు అంగన్‌వాడీల ద్వారా నాణ్యమైన విద్య అందే అవకాశం ఉంటుందని తెలిపారు. అంగన్‌వాడీలను నిర్వీర్యం చేసే దిశగా ప్రయత్నాలు చేస్తే ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు. రెండు రోజులపాటు నిర్వహించిన ధర్నాలో వందల మంది అంగన్‌వాడీలు పాల్గొనడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు మాట్లరాజు, శ్రీకాంత్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివేణి, గంగామణి, అరుణ, స్వరూప, రాజేశ్వరి, కమల, అంజలి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

అసెంబ్లీలో బీసీ బిల్లు గొప్ప విజయం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడం అన్ని పార్టీలు మద్దతు తెలపడం బీసీల గొప్ప విజయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ అన్నారు. బీసీ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడంపై జిల్లాలోని సంఘ భవనంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు విద్యా, ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రాజకీయ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందడం హర్షనీయమన్నారు. ఈ చట్టం బీసీల మొదటి పోరాట విజయం అన్నారు. బీసీ బిల్లు ఆమోదం తదుపరి అమలు కోసం ఢిల్లీ కేంద్రంగా జరిగే పోరాటం పైన అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని కోరారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం చట్టం చేసిన సీఎంతో పాటు ఇతర ప్రముఖులకు ప్రతిపక్ష పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం బాలేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల జక్కన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వైరగడే మారుతి పటేల్, బీసీ సంక్షేమ సంఘ సభ్యులు మొహర్లే విశ్వనాథ్, బొట్టుపల్లి కమలాకర్, పసుపులేటి బాలు, మల్క సత్యనారాయణ, బెండరే శ్యామ్ రావు, షిండే నాందేవ్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ రాయితీపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎల్ఆర్ఎస్-2020 పథకంలో రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మండలంలోని బురుగూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్‌తో కలిసి గ్రామపంచాయతీ పరిధిలోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు చేసుకొని క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న వారికి ప్రభుత్వం మంచి అవకాశాన్ని కల్పించిందని, 25 శాతం రాయితీని దరఖాస్తుదారులు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. నూతన ఇంటి నిర్మాణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తప్పనిసరిగా ఎల్ఆర్ఎస్ చెల్లించాల్సి ఉంటుందని, తద్వారా బ్యాంకు రుణ సౌకర్యం పొందవచ్చని తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో 78 మంది దరఖాస్తుదారులకు గాను 3 మంది మాత్రమే ఆన్‌లైన్ ద్వారా చెల్లించారని, ఈనెల 31వ తేదీలోగా రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అభ్యర్థులు చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

నర్సరీలో మొక్కల సంరక్షణ

గ్రామపంచాయతీ పరిధిలోని నర్సరీని సందర్శించి మొక్కల నిర్వహణను పరిశీలించారు. మొక్కల పెంపకంలో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని, విత్తన అభివృద్ధి, మొక్కల పెంపకం అంశాలలో శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. విత్తనాలు నాటుతున్న భూమి వివరాలు తెలుసుకొని ప్రతిరోజు సకాలంలో నీటిని అందించాలని తెలిపారు. నర్సరీలో నాటిన విత్తనాలు మొలకెత్తక పోవడంపై 2 రోజులలో నివేదిక అందించాలని ఏపీఎంను ఆదేశించారు. మొక్కలు నాటేందుకు మరో 2 నెలల గడువు ఉన్నందున నర్సరీలలో విత్తనాలు త్వరగా మొలకెత్తేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మొక్కల పెంపకంపై అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మౌనిక, ఈజీఎస్ ఏపీఎం చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి శ్రీలత పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలోని కేజీబీవీలో 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు మంగళవారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ జి.అరుణ అధ్యక్షణ జరిగిన సదస్సులో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు మోటివేషనల్ స్పీకర్ సుందిళ్ల రమేష్ విద్యార్థులకు పలు విషయాలను వివరించారు. ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేస్తే విజయం వరిస్తుందని, ప్రతి విద్యార్థికి లక్ష్య నిర్దేశం ఉండాలని దీనికి క్రమశిక్షణ ముఖ్యమన్నారు. క్రమశిక్షణతో పాటు సమయపాలన పాటించాలని, సినిమాలు చెడు అలవాట్లకు అదేవిదంగా సెల్ ఫోన్‌కు ఆకర్షతులవటం కారణంగా ఏకగ్రత కోల్పోతారన్నారు. స్వీయనియంత్రన పాటిస్తూ ఒత్తిడిని జయించాలన్నారు. విద్యార్థులలో పరీక్షలంటే భయం ఉండకూడదని తెలియజేశారు.



దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ లక్ష్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఒకే దేశం ఒకే ఎన్నిక అనే నినాదంతో బీజేపీ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతుందని జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలంతో కలిసి 16 మండలాల వన్ నేషన్ వన్ ఎలక్షన్ కన్వీనర్లు, కోకన్వీనర్లతో జిల్లాస్థాయి కార్యశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ సభ అసెంబ్లీ స్థానిక సంస్థల ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం ద్వారా ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. పరిపాలన సామర్థ్యాన్ని పెంచడమే ప్రధాన లక్ష్యంగా బీజేపీ 1984 నుండి పనిచేస్తుందని తెలిపారు. పార్లమెంట్‌లో మెజార్టీ లేకపోవడంతో గతంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు ముందుకు వెళ్లలేదని తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలకు నిర్వహణ కోసం క్యాబినెట్‌లో ఆమోదం తెలపడంతో పాటు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టడం జరిగిందని వివరించారు. క్షేత్రస్థాయిలో ఒకే దేశం ఒకే ఎన్నిక నినాదాన్ని తీసుకువెళ్లేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేం చేసేల దిశగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చర్ల మురళి, సీనియర్ నాయకులు బోనగిరి సతీష్ బాబు, రాజేందర్, మల్లయ్య పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నిందితురాలి రిమాండ్

నవతెలంగాణ-లక్షెట్టిపేట



దొంగతనం కేసులో నిందితురాలికి రిమాండ్ విధించినట్టు లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్, ఎస్ఐ సతీష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 16న లక్షెట్టిపేట పట్టణంలోని గోదావరి రోడ్డుకు చెందిన కొత్త శ్యామల అనే మహిళ మెడలో బంగారు గొలుసు దొంగిలించిన నిందితురాలు సముద్రాల వసంతను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండుకు తరలిచారు. ఎదురింట్లో ఉంటున్న వసంత ఒంటరిగా ఉండటం గమనించి ప్లాన్ ప్రకారం శ్యామల మెడలోని సుమారు 3తులాల బంగారు పుస్తెల తాడు లాక్కొని పరార్ అయ్యింది. బాధితురాలు శ్యామల పిర్యాదు మేరకు పారిపోయిన మహిళను అదుపులోకి తీసుకొని గొలుసు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచి రిమాండుకు తరలించామని తెలిపారు.

అందుబాటులో నూతన అంబులెన్స్

నవతెలంగాణ-జన్నారం



మండల ప్రజలకు నూతన అంబులెన్స్ అందుబాటులోకి వచ్చిందని ప్రోగ్రాం మేనేజర్ బి సామ్రాట్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో నూతన అంబులెన్సును ఆయన ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాలు, డెలివరీ, తదితర అత్యవసర సమయాలలో వేగంగా ఆస్పత్రులకు తరలిస్తామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఎంటీ సంపత్, మునీందర్ గౌడ్, పైలట్ రఫిక్, కళ్యాణ్, రమేష్, రవి, మహేందర్ పాల్గొన్నారు.

'ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలను వాడొద్దు'



నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు వాడొద్దని తాండూర్ వ్యవసాయ అధికారి సుష్మ తెలిపారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి రైతు వేదికలో రైతులకు విత్తనాల ఎంపిక, పంట మార్పిడి, వేసవి దిక్కుల ఆవశ్యతపై అవగాహన కల్పించారు. రైతులు ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలనే వాడాలని సూచించారు. గ్లైపోసిట్ విత్తనాల వాడకం వల్ల పర్యావరణం దెబ్బతింటుందనన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో పని చేసే వారికి క్యాన్సర్ వంటి రోగాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రైతులు వేసవి దిక్కులు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. వాలుకు అడ్డంగా దుక్కులు చేసుకుంటే వర్షపు నీరు ఇంకిపోయి పంట దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. వేసవిలో దిక్కులు చేసుకోవడం వల్ల భూమిలో ఉన్న శిలీంద్రాలు కీటకాలు ఎండ వేడిమికి చనిపోయి చీడపీడల ఉధృతి తక్కువగా ఉంటుందని తెలిపారు. రైతులు ఒకే పంట విధానాన్ని అవలంబించడం వల్ల భూమిలో సారం దెబ్బతింటుందన్నారు. పంట మార్పిడి పద్ధతులను పాటించి భూసారాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఉద్యానవన శాఖ అధికారి అర్చన మాట్లాడుతూ రైతులు వాణిజ్య పంటలతో పాటుగా కూరగాయల పంటలపై దృష్టి సారించాలని తెలిపారు. రైతులు బహువార్షిక పంటగా ఆయిల్ ఫామ్ తోటలు సాగు చేస్తూ లబ్ధి పొందాలని తెలిపారు. ఆయిల్ ఫామ్ తోటలకు ప్రభుత్వం రాయితీలను అందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు శంకర్, ధనలక్ష్మి, ఏఈఓ వెంకటేష్ పాల్గొన్నారు.

డిస్పెన్సరీలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తాం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపుర్ ఏరియాలోని ఆర్కే-8 డిస్పెన్సరిలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ నాయకులు, బ్రాంచ్ సెక్రెటరీ ఎస్కే బాజీ సైదా, వైస్ ప్రెసిడెంట్ కొట్టే కిషన్ రావు అన్నారు. మంగళవారం ఆర్కే-8 డిస్పెన్సరీ పిట్ కార్యదర్శి విజయ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిస్పెన్సరీలో పనిచేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ డిస్పెన్సరీలో ఉన్న సమస్యలపై జీఎం చర్చల స్ట్రక్చర్ సమావేశంలో మీరు చెప్పిన సమస్యలను పొందుపరిచి వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తామని, మహిళా ఉద్యోగుల కోసం ఏరియా స్థాయిలో క్రేచ్ త్వరలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. డిస్పెన్సరీ ఉద్యోగులు ఏ సమస్య వచ్చినా మా దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీడియా ఇన్‌చార్జి రాజ్ కుమార్ , నాయకులు గణేష్, ప్రణయ్, లింగమూర్తి పాల్గొన్నారు.

దళితవాడపై ఎందుకు వివక్ష



నవతెలంగాణ-మందమర్రి

స్థానిక సమస్యలపై సీపీఐ(ఎం) నాయకులు బస్తీ బాట చేపట్టారు. బస్తీ బాటలో భాగంగా మంగళవారం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటీ సభ్యుడు దూలం శ్రీనివాస్ యాపల్ 1వ వార్డు ఎస్సీ కాలనీలో పర్యటించారు. స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగు నీరంతా నిల్వ ఉండటంతో దోమలు పెరిగి నరక యాతన అనుభవిస్తున్నట్లు గ్రహించారు. రోడ్డు సౌకర్యం లేక మురికి కూపంలో తీవ్ర ఇబ్బందులు పడుతూ జీవనం సాగిస్తున్నారు. దరఖాస్తులు పెట్టుకున్నా డబుల్ బెడ్ రూం, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయలేదు. చెట్లు పెరిగి కరెంటు తీగలపై ఎప్పుడు విరిగిపడతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీనిపై ఏఈకి పిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. 50 కుటుంబాలు ఉంటున్న కాలనీలో చాలామందికి రేషన్ కార్డులు లేక, ఒంటరి మహిళలకు పెన్షన్లు మంజూరు రాక ఇబ్బంది పడుతున్నారు. కెకె - 2 ఓసి కార్యాలయం వద్ద రిక్వెస్ట్ బస్టాప్ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన పాలకులు, అధికారులు దళిత వాడ అనే వివక్షను చూపకుండా కనీస సౌకర్యాలను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసారు. లేని పక్షలంలో సమస్యల పరిష్కారానికి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత

నవతెలంగాణ-మందమర్రి

జనరల్ మేనేజర్ కార్యాలయంలో మంగళవారం జీఎం దేవేందర్ 40 మెడికల్ ఇన్ వాలిడేషన్ డిపెండెంట్లకు కారుణ్య నియామక పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఏరియాలో ఇప్పటివరకు కారుణ్య నియామకాల ద్వారా 1972 మందికి ఉద్యోగాలు ఇచ్చినట్టు తెలిపారు. ఇతర పరిశ్రమలతో పోలిస్తే సింగరేణిలో పని స్థలాలు సమయాలు భిన్నంగా ఉంటాయని విధులకు గైర్హాజరు అయితే ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు. కష్టించి పనిచేసి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మందమర్రి ఏరియా బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సీఎంఓఏఐ ప్రెసిడెంట్ రమేష్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డీవైపీఎం సత్య బోస్, రాజలింగు(ఒఎస్), బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

హామీల అమలులో నిర్లక్ష్యం తగదు

• అంగరాజ్‌పల్లిలో సర్వే చేపట్టిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-జైపూర్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యం చేస్తున్నాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోడంకి చందు అన్నారు. మంగళవారం చెన్నూర్ మండలం అంగరాజ్‌పల్లిలో సీపీఐ(ఎం) నాయకులతో కలిసి చేపట్టిన ఇంటి సర్వే ద్వారా ప్రభుత్వం ఇచ్చిన హామీలు, అమలులో ఉన్న పథకాల ఫలితాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అవాజ్ యోజన పథకం, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు పంపిణీలో పేద ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా అర్హులైనటువంటి వృద్ధులకు ఆసరా పింఛన్లు అందక పోగా రేషన్ కార్డుల పంపిణీ చేయకపోవడంతో గ్రామీణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతు బంధు, రైతు రుణ మాఫీ అమలు చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని ఈ సందర్భంగా సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శ్రామిక అనగారిన ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక కృషి చేయాలని లేనిపక్షంలో రాబోవు రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరీంభి, తాండ్ర అనిల్, శేఖర్, లింగయ్య మల్లక్క, రంజిత్ పాల్గొన్నారు.



అంగరాజ్‌పల్లిలో సర్వే చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

జన్నారం : మండలంలోని అన్ని గ్రామాల్లో ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించి వెంటనే వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, సీపీఐ(ఎం) మంచిర్యాల జిల్లా కార్యవర్గ సభ్యుడు కొండగుర్ల లింగన్న అన్నారు. మంగళవారం మండలంలోని మురిమడుగు గ్రామంలో సీపీఐ(ఎం) సర్వే నిర్వహించారు. ఆ గ్రామంలో పేదవారికి ఇండ్లు లేవన్నారు, ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గత నాలుగు సంవత్సరాలుగా, అర్హులైన వారికి పెన్షన్లు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వెంటనే వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వచ్చేది వేసవికాలం గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎం) ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అంబటి లక్ష్మణ్, రాజన్న పాల్గొన్నారు.



జన్నారం : మురిమడుగు గ్రామంలో సర్వే చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

భూ వివాదాన్ని పరిష్కరించిన అధికారులు

నవతెలంగాణ-తాండూర్

ప్రత్యేక ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తు ఆధారంగా తాండూరు మండల అధికారులు అచలాపూర్ గ్రామంలో భూవివాదాన్ని పరిష్కరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన రెవెన్యూ సర్వే అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో పోలీసు అధికారుల సమక్షంలో సమస్యను సామరస్యంగా పరిష్కరించారు. వివరాల్లోకెలితే ఆచాలాపూర్ గ్రామ శివారు, కొమ్ముగూడెం గ్రామంలో సర్వే నంబర్ 542లో ఒక గుంట స్థలము అటవీ శాఖకు దుర్గం చిన్నమ్మ కుటుంబం బహుమానంగా ఇచ్చారు. స్థలానికి ఆనుకొని ఉన్న 14 గుంటల భూమికోసం గ్రామస్తులు, దుర్గం చిన్నమ్మ కుటుంబం మధ్య వాదన నడుస్తుంది. గ్రామస్తులు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా ఆర్ఐ క్షేత్ర స్థాయిలో సర్వేయర్‌లు చేసి హద్దు కొలతలు తీశారు. రికార్డుల ఆధారంగా సంబంధిత భూమి దుర్గం చిన్నమ్మ కాదని తేల్చివేశారు. విషయాన్ని మండల అధికారులకు నివేదించిగా, తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీఓ శ్రీనివాస్, సీఐ కుమారస్వామి, ఎస్ఐ కిరణ్ కుమార్, దుర్గం చిన్నమ్మను పిలిచి సమస్యను సామరస్యంగా పరిష్కరించారు. విషయాన్ని నచ్చజెప్పడంతో దుర్గం చిన్నమ్మ అంగీకరించారు. జిల్లాలో మొదటి భూ వివాదాన్ని తాండూర్ మండలంలో పరిష్కరించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గంగిపల్లిలో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ

• మొదటి దశలో 117 ఇండ్ల నిర్మాణం



భూమిపూజ చేస్తున్న ఎంపీడీఓ

నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం గంగిపల్లిగ్రామంలో మొదలైంది. మంగళవారం గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి స్థానిక ఎంపీడీఓ ఇండ్ల నిర్మాణాకి భూమి పూజ చేశారు. గంగిపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా గుర్తించి మొదటి దశలో 117 ఇందిరమ్మ ఇండ్లు నిర్మించనున్నట్లు స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. గ్రామ పంచాయతీకి చెందిన 318 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం ధరఖస్తు చేసుకున్నట్లు తెలిపారు. అర్హులై ఉండి ఇంటి స్థలం కలిగివున్న వారికి మొదటి విడతగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇంటి నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు ప్రభుత్వ పరంగా రూ.5 ఆర్థిక తోడ్పాటు అందుతుందని తెలిపారు. బేస్‌మేట్ పూర్తి తరువాత రూ.1 లక్ష రూఫ్ లెవల్ పూర్తి తరువాత రూ.1 లక్ష ఇంటి నిర్మాణం పూర్తి చేసి ప్లాస్టరింగ్ సహా నివాసయోగ్యంగా నిర్మించిన అనంతరం మిగితా రూ. 3 లక్షల ఆర్థిక తోడ్పాటు అందుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కృహ నిర్మాణ శాఖ పీడీ బన్సిలాల్, డీఈ మునేందర్, ఎంపీడీఓ సత్యనారాయణ, తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీఓ శ్రీపతి బాపురావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్థికంగా నష్టపోతున్న రైతులు

నవతెలంగాణ-జైపూర్

రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాయకులు కాంతయ్య, (ఐఎఫ్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు గోపినాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. చెన్నూర్ శివారు మిర్చి రైతులు అశోక్, దినేష్‌లతో కలిసి మంగళవారం పంట క్షేత్రాలను సంధర్శించి మాట్లాడారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ పరిస్థితుల కారణంగా ఏటకేటా దిగుబడి తగ్గుతుందని, కొద్దిపాటి దిగుబడి పొందిన పంటలకు మద్దతు ధర లభించకపోవడం సరికాదన్నారు. ఫలితంగా పంటల సాగులో రైతులు అప్పుల ఊబిలోకి జారుతున్నారని తెలిపారు. విత్తనాలతో పాటు రసాయన ఎరువులు, పిచికారి మందులకు ఎప్పటికప్పుడు రేట్లు పెంచుతున్న కంపెనీల వారు లాభాలు గడిస్తుండగా ఆరుగాలం శ్రమించిన రైతులు మాత్రం ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. మిర్చి పంట క్వింటాలుకు రూ. 25 వేల మద్దతు ధర ప్రకటించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతుకు న్యాయం చేయడం కోసం వ్యవసాయాన్ని బతికించుకోవడం కోసం మద్దతు ధర చట్టం వెంటనే చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.



రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘాల నాయకులు

తండ్రి మందలించాడని మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-జైపూర్



మండలంలోని శివ్వారం గ్రామానికి చెందిన గెల్లు సమ్మయ్య కొడుకు రాకేష్(26) సోమవారం సాయంత్రం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని స్థానిక అదనపు ఎస్ఐ నాగరాజు తెలిపారు. పొలం పనులకు సంబంధించి తల్లితండ్రులతో గొడవ పడిన రాకేష్‌ను తండ్రి సమ్మయ్య మందలించడంతో మనస్థాపం చెందిన రాకేష్ గ్రామ సమీపంలోని మంగలి గట్టుపై చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఈ మేరకు అందిన సమాచారం మేరకు రాకేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిను ఏఎస్ఐ తెలిపారు.

'ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం'



నవతెలంగాణ-జన్నారం

ఒక్క సీసీ కెమెరా 100 పోలీసులతో సమానమని ఎస్ఐ గుండేటి రాజ వర్ధన్ అన్నారు. మంగళవారం మండలంలోని తపాలపుర్ గ్రామంలో గ్రామస్తులు నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో దొంగతనాలు, నేరాలు జరగకుండా సీసీ కెమెరాలు తోడ్పడతాయన్నారు. నేరాల నియంత్రణకు ఇది ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గ్రామాల్లో నేరాలు జరిగినప్పుడు సీసీ కెమెరా ఫుటేజ్ తోని దొంగలను పట్టుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఐడీ పార్టీ పోలీస్ తుకారం ఆ గ్రామ మాజీ సర్పంచ్ నైనాల తిరుపతి, పీఏసీఎస్ చింతగూడ వైస్ చైర్మన్ కమ్మల విజయ ధర్మ సత్యనారాయణ, మామిడి రమేష్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-జన్నారం

వేసవిలో పంట పొలాల్లో దుక్కిదున్నడం, మామిడి తోటలో యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు రైతు నేస్తం కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. ప్రతి మంగళవారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించే రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో భాగంగా ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్, హరికాంత్ మామిడి తోటలో యాజమాన్య పద్ధతుల గురించి వివరించగా,(అగ్రోనమి) సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్. సయ్యద్ అహ్మద్ హుస్సేన్ వేసవిలో దుక్కి దున్నడం వలన కలిగే ప్రయోజనాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కల్పన, మార్కెట్ కమిటీ చైర్మన్. దుర్గమ్ లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయ అధికారి. పి సంగీత, వ్యవసాయ విస్తరణ అధికారులు త్రిసంధ్య, దివ్య, సాయి, లవన్, అక్రమ్ పాల్గొన్నారు.

మందపల్లి పశువుల వారసంత వేలంపాట

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రేండ్లగూడ గ్రామంలో ప్రతి సోమవారం నిర్వహించే పశువుల వారసంత వేలం పాటను ఈ నెల 20 తేదీన నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి లకావత్ శ్రీనివాస్ నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేండ్లగూడ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మార్చి 20న ఉదయం 11 గంటలకు పశువుల వారసంత వేలంపాట ఉంటుందన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.30,000 డిపాజిట్ చెల్లించలన్నారు. ఆసక్తి గలవారు ముందుగానే డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం గ్రామపంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆలయ నిర్మాణానికి రూ.20 వేల విరాళం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కొత్తూరు పల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ రూ.20 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు, కావాలన్నారు. దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. పోచమ్మ తల్లి ఆశీస్సులు ప్రతి ఒక్కరుపై ఉండాలని ఆ తల్లిని కోరారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వర్గీకరణ తర్వాత ఉద్యోగాలు భర్తీ చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ జాతీయ నాయకులు రేగుంట కేశవ్ అన్నారు. స్థానిక అంబేద్కర్ చౌక్ ఎదుట మూడో రోజు నిరసన దీక్షలో భాగంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం ఆలస్యం చేయకుండా వర్గీకరణ చట్టబద్ధత కల్పించాలని కోరారు. అప్పుడే ఉద్యోగాల ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షకు మాదిగ మహిళా సమైక్య సభ్యులు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో రేగుంట యశోద, సుశీల, చిన్నక్క, వాని, ప్రమీల, లక్ష్మి, వైశాలి, లక్ష్మి, రాధ, దుర్గ, తిరుపతి, లింగమూర్తి, సురేష్, నర్సయ్య పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

నవతెలంగాణ-దండేపల్లి



మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన విద్య నేర్చుకోవాలని, వార్షిక పరీక్షలకు బాగా చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. పదో తరగతి విద్యార్థులు కూడా పరీక్షలు బాగా రాసి తమ భవిష్యత్తును నిర్ణయించుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఆటపాటలతో రోజంతా ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారి రాజ్‌కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అనిత, కళాశాల ప్రిన్సిపల్ శోభ, మాజీ ప్రధానోపాధ్యాయులు శంకర్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ మనందరి భాధ్యత



నవతెలంగాణ-మందమర్రి

అటవీ సంరక్షణ మనందరి బాధ్యత అని ప్రతి ఒక్కరు అటవీ చట్టాలపై అవగాహన పెంచుకొని అడవులను సంరక్షించుకోవాలని ఫారెస్ట్ సెక్షన్ అధికారి(ఆవడం) రేపతిరెడ్డి అన్నారు. పొన్నారం గ్రామంలో మంగళవారం మహత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని ప్రదేశాలను ఫారెస్ట్ సెక్షన్ అధికారి(ఆవడం) పరిశీలించి ఉపాధి కూలీలకు అటవీ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 (ఏ)(జి) ప్రకారం అడవులను కాపాడుట, వన్యప్రాణుల సంరక్షణ మన అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. అడవులలో అగ్ని ప్రమాదాలు జరుగకుండా చూడాలని కోరారు. ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్(మామిడిగట్టు) రమేష్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ ఈద లింగయ్య, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్షిప్ చెక్కులు అందచేత



నవతెలంగాణ-మందమర్రి

జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం దేవేందర్ మెరిట్ స్కాలర్షిప్ చెక్కులను విద్యార్థినుల తండ్రులకు అందజేశారు. కెకె ఓసీపీలో ఈపీ ఆపరేటర్‌గా పని చేస్తున్న నూనె సాంబయ్య కుమార్తె నూనె పావని గవర్నమెంట్ మెడికల్ కాలేజీ సిద్దిపేట లోఎంబీబీఎస్ 4వ సంవత్సరం, నూనె జనని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కర్ణాటక సూరత్కల్ ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న ఇద్దరు కుమార్తెలకు చెరు రూ. పదివేల చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుతున్న ఉద్యోగుల పిల్లలను ప్రోత్సహించేందుకు సింగరేణి సంస్థ మెరిట్ స్కాలర్షిప్‌ను అందజేస్తుందన్నారు. పిల్లలను ఉన్నత చదువు దిశగా ప్రోత్సహించినందుకు తల్లి దండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సీఎంఓఏఐ అధ్యక్షులు రమేష్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఆఫీస్ సూపరింటెండెంట్ రాజలింగు, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వంద శాతం అక్షరాస్యత సాధించాలి

- అదనపు పాలనాధికారి మోతీలాల్



నవతెలంగాణ-కాసిపేట

మండలాన్ని వంద శాతం అక్షరాస్యత మండలంగా తీర్చాలని అదనపు కలెక్టర్ మోతీలాల్ పేర్కొన్నారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీలలో వయోజన విద్యా కార్యక్రమంలో భాగంగా ఓరియంట్ సిమెంట్ కంపెనీ సహకారంతో వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో వంద శాతం అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో ప్రారంభించిన కార్యక్రమంలో భాగంగా చదువుకుంటున్న అభ్యాసకులకు కావాల్సిన విద్య అంశాలను నేర్చుకునే సంబంధిత విద్యా అభ్యసన ప్రణాళిక పుస్తక ఆవిష్కరణ చేశారు. అనంతరం పుస్తకాలను చదువు నేర్పిస్తున్న వారికి ఎంపీడీఓ కార్యాలయంలో పంపిణీ చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మోతీలాల్ మాట్లాడుతూ పట్టుదలతో అందరికీ చదువు నేర్పించి అక్షర ధానం చేసి ఆదర్శవంతంగా మండలాన్ని తీర్చి దిద్దాలని చదువునేర్పుతున్న ఇన్స్టక్టర్లను కోరారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యా పీడీ అజ్మీర పురుషోత్తం నాయక్, ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, తహసీల్దార్ భోజన్న, ఎంపీఓ శేక్ సప్థర్ అలీ, ఐకేపీ ఏపీఎం వెంకటేశం, డీఆర్పీ బండ శాంకరీ, జనార్ధన్ పాల్గొన్నారు.

గనిని సందర్శించిన కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు

నవతెలంగాణ-కాసిపేట



మందమర్రి ఏరియాలోని కాసిపేట-1 ఇంక్లైన్ గనిని మంగళవారం కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు సందర్శించారు. ఈ సందర్భంగా గనికి సంబంధించి పలు అంశాలపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల నూతన బాధ్యతలు తీసుకొని గనికి వచ్చిన ఏజెంట్ రాంబాబును అధికారులు, నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానం చేసి జ్ఞాపికను అందించారు. అనంతరం ఏజెంట్ రాంబాబు మాట్లాడుతూ అధికారులకు, ఉద్యోగులకు అందుబాటులో ఉండి ఉత్పత్తి, రక్షణ, సంక్షేమంపై దృష్టి పెడ్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, గని మేనేజర్ భూ శంకరయ్య, రక్షణాధికారి నిఖిల్ అయ్యర్, పిట్ ఇంజనీర్ మధుకర్, డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, సంక్షేమ అధికారి మీర్జా గౌస్, జీషాన్, సర్వేయర్ ప్రభాకర్, ఖాన్, రాజ్ కుమార్, ఇంజనీర్ రామకృష్ణ, బన్న లక్ష్మన్‌దాస్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రెటరీ దాగం మల్లేష్, పిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మీ నారాయణ, బెల్లంపల్లి బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, వైస్ ప్రెసిడెంట్ బియ్యల వెంకట స్వామి పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఐసీడిఎస్‌కు కోత విధించడం సరికాదు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి

నవతెలంగాణ-నస్పూర్



మహా ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి

కార్పొరేట్ సంస్థలకు రూ.16లక్షల కోట్ల బ్యాంక్ రుణాల రద్దు చేసిన విధానం బీజేపీ మోడీ దని, వారి బాటలోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నడుస్తుందని, ఐసీడీఎస్‌కు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కోత విధించిందని అది సరికాదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట అంగన్‌డీ 48 గంటల పోరాటానికి సీపీఐ(ఎం) నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, మోడీ ప్రభుత్వానికి కార్పొరేట్ సంస్థల అధిపతులపై ఉన్న ప్రేమ కనీసం పేదలకు సేవలందిస్తున్న ఐసీడీఎస్ అంగన్‌వాడీల పట్ల లేకపోవడం శోచనీయమని అన్నారు. కార్పొరేట్ సంస్థలు బ్యాంక్‌ల వద్ద తీసుకున్న రుణాల్లో రూ:16 లక్షల కోట్ల రుణాలు రద్దు చెయ్యడం, మరో ప్రక్క కేంద్ర బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు తగ్గించడం దుర్మార్గమని అన్నారు. దేశ వ్యాప్తంగా కోట్లాది మంది పేదలకు సేవలందిస్తున్న ఐసీడీఎస్ సంస్థను నిర్వీర్యం చెయ్యడం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కుట్రలు చేస్తుందని, ఇందులో భాగంగానే జాతీయ నూతన విద్య విధానం, రోజుకో కొత్త యాప్‌లు, ఎన్నికల్లో అనేక హమీలిచ్చిన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందన్నారు. లక్షలాది రూపాయల వేతనాలు, అలవెన్సులు తీసుకుంటున్న ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యే వరకు కూడ వారు చేస్తున్న పని వివరాలు, ప్రజలకు సేవలందిస్తున్నార లేదా అనే వివరాలను తెలిజెయ్యడం కోసం వారి చుట్టు సీసీ కెమెరాలు, పోన్ యాప్‌లు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు గుమాస అశోక్, దూలం శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు దుంపల రంజిత్ కుమార్, ప్రకాష్, చల్లూరి దేవదాసు, ఏఐఏడబ్ల్యూయూ జిల్లా అధ్యక్షుడు బ్రమయ్య, రజక సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాలా రాములు పాల్గొన్నారు.

కాసిపేట గనిపై ఏఐటీయూసీ గేట్ మీటింగ్

- హాజరైన ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-1వ ఇంక్లైన్ గనిపై మంగళవారం ఏఐటీయూసీ గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ గేట్ మీటింగ్ కు బొగ్గు గని కార్మికుల శాశ్వత వేజ్ బోర్డు సభ్యులు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సత్తుపల్లి, ఇల్లందు రెండు మైన్లను ప్రయివేట్ వ్యక్తులకు టెండర్ ఇవ్వడం జరిగిందని, ఈ టెండర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ టెండర్లను రద్దు చేయకుంటే సమ్మె చేసి హక్కులను సాధించుకుంటామన్నారు. ఈ టెండర్లలో పాల్గొనడానికి సింగరేణి అవకాశం ఇవ్వాలన్నారు. స్ట్రక్చర్ సమావేశంలో విజిలెన్స్ కేసులు, మారుపేరు కేసులు, వయసు 40 సంవత్సరాలు ఉన్న వారికి గాని, సర్టిఫికెట్లు తప్పులు దొర్లాయని ఆపిన కేసులు, అన్నింటిని కూడా కమిటీలు వేసి అతి తొందరలో పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరగా త్వరలో పరిష్కరిస్తామని తెలిపినట్లు వివరించారు. ఇన్కం ట్యాక్స్, సొంత ఇంటి పథకానికి సంబంధించి కూడా కమిటీలు వేయడం జరిగిందన్నారు. అన్ని మైన్స్ అండ్ డిపార్ట్మెంట్లలో కార్మికులకు లాకర్స్ కబోర్డ్స్, ఆఫీసర్ ఫర్నీచర్ ఇచ్చేందుకు అంగీకరించారన్నారు. డిస్మిసైన కార్మికులకు ఐదు సంవత్సరాల్లో ఏ ఒక్క సంవత్సరం 100 మాస్టర్లున్నా వారి ఉద్యోగం కల్పించేందుకు అంగీకరించినట్లు తెలిపారు. కోల్ ఇండియాలో లేని 11 రకాల అలవెన్సులను కార్మికులకు పెంచుటకు అంగీకరించారన్నారు. సొంత ఇల్లు కట్టుకున్న వారికి క్వార్టర్ వెకేషన్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలిపారు. సింగరేణిలో ఎన్నికలే వద్దని యాజమాన్యానికి రాసిచ్చినటువంటి సంఘాలు కూడా ఇప్పుడు ఏఐటీయూసీని విమర్శించడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ఆ సంఘాలు కనువిప్పు చేసుకోవాలని, ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. కొంత మంది అధికారులు, కార్మికులపై పని భారం మోపుతూ కార్మికులను కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. వారిపై తగు చర్యలు తీసుకోవడంపై అధికారుల దృష్టికి తీసుకుపోతామన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, మీనుగు లక్ష్మీనారాయణ, ఎస్ నాగేశ్వరరావు, చిప్పరి శ్రీహరి, వీ రాజేందర్, పార్వతి సురేష్, కొక్కిరాల సంతోష్, వీ లింగయ్య, సంపత్, రంజిత్, అశోక్, బాల్యం శ్రీనివాస్, సిగ్గం శంకరయ్య, మైనింగ్ స్టాఫ్ సెక్రెటరీ ఆడెపు రవీందర్, బియ్యాల రాజన్న, శంకరయ్య, దేవేందర్, ప్రభుదేవ్, ఆవునూరి తిరుపతి, కోలకాని శ్రీనివాస్, జాడి పోశం పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థాయికి చేరాలి

నవతెలంగాణ-కాసిపేట



విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఎంఈఓ, హెచ్‌ఎం

పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఎంఈఓ ముక్తవరం వెంకటేశ్వర స్వామి పేర్కొన్నారు. మంగళవారం కాసిపేట మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఈఓ వెంకటేశ్వర స్వామి మాట్లాడుతూ పరీక్షలు అంటే మానసిక ఒత్తిడికి గురి కావద్దని, విద్యార్థులు కష్టపడి చదవాలని మంచి మార్కులతో పాస్ అవ్వాలని, ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని, దానిని సాధించడం కోసం ఆహర్నిశలు కష్టపడాలని సూచించారు. డ్రగ్స్ మాఫియాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌కు అలవాటు పడితే కుటుంబాలను కోల్పోతారన్నారు. అనివార్య కారణాల వలన విద్యార్థులు పరీక్షలు తప్పితే మానసిక ఆందోళనకు గురికావద్దని, మరొక అవకాశంలో తప్పకుండా చదివి పాస్ అవుతారని విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. విద్యార్థులు ఉపాధ్యాయులతో విద్యార్థులతో పాఠశాలతో తమకున్న అనుబంధాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి. అనంతరం వివిధ అంశాలలో గెలుపొందిన విద్యార్థులకు, క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చే హాజరు శాతం ఎక్కువగా ఉన్న విద్యార్థులకు, సైన్సు ఇంగ్లీష్ అంశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కాసిపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం సాంబమూర్తి చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుష్పలత, బండ శాంకరి, పల్లె కృష్ణ గోపాల్‌రావు, జ్యోతి, మాధవి లత, మామిడి తిరుపతి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాండం తొలుచు పురుగు నివారణ చర్యలు చేపట్టాలి

- ఆరేపల్లి శివారు పంట క్షేత్రాలను సందర్శించిన వ్యవసాయ అధికారి సుధాకర్



పంట క్షేత్రాలను పరిశీలించిన వ్యవసాయ అధికారి సుధాకర్

నవతెలంగాణ-జైపూర్

వరి పైరును ఆశించిన రెండు తెగులు, కాండం తొలుచు పురుగు నివారణ చర్యలు చేపట్టాలని భీమారం వ్యవసాయ అధికారి సుధాకర్ సూచించారు. మంగళవారం ఆరేపల్లి శివారు వరి పంట క్షేత్రాలను అరుణ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. వరిలో బ్యాక్టీరియా ఎండు తెగులు, కాండం తొలుచు పురుగును గమనించినట్లు తెలిపారు. నివారణ చర్యగా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 75 శాతం ఎస్‌జీ 200 గ్రాములు లేదా టెట్రా నిప్రోలు 18.8 శాతం 200 గ్రాములు క్లోరన్ట్రినీప్రోలు 18.5 శాతం ఎస్‌జీ పిచికారి ద్వారా ఎండు తెగులు కాండం తొలుచు పురుగు నివారించవచ్చని సూచించారు. లాంబ్డాసైహలోత్రిన్‌తో క్లోరన్ట్రినీప్రోలు100 ఎంఎల్ ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసినా నియంత్రించ వచ్చని తెలిపారు. అదేవిధంగా బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు దీని నివారణకు గాను కాసుగామైసిన్ 5 శాతంతో కాపర్ ఆక్సి క్లోరైడ్ 45 శాతం500 గ్రాములు లేదా ప్లాంటోమైసిన్ 100 గ్రాములు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసి ఎండు తెగులు నివారించుకోవచ్చని సూచించారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశ దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6 నుండి 10 వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 20వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. దరఖాస్తు చేయుటకు సమీప మీ సేవా కేంద్రంలో సంప్రదించి 20వ తేదీలోగా తెలంగాణఎంఎస్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని లేదా ఉచితంగా దరఖాస్తు చేయుటకు ఆధార్ కార్డు, ఫొటోతో పాఠశాలకు హాజరు కావాలని తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లకు, 7 నుండి 10వ తరగతుల్లో ఖాళీ సీట్లకు ఏప్రిల్ 27వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని వెలుగనూరు గ్రామానికి చెందిన కాంద్రపు అంజన్న(26) అత్తింటి వారు దూషించారని మనస్థాపంతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు దండేపల్లి ఎస్ఐ తహసినుద్దీన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. అంజన్నకు మండలంలోని కాసిపేటకు చెందిన మాదాసు శిరీష రెండు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారం రోజుల క్రితం ఇరువురికి పాప జన్మించింది. పాపను చూసేందుకు అత్తవారింటికి వెళ్లగా భార్యతో పాటు అత్త, మామ అందరు కలిసి అంజన్నను దూషించారని ఆరోపిస్తూ సెల్ఫీ వీడియో తీసి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని తండ్రి కాంద్రపు భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక రవాణాపై నిఘా పెంచాలి

నవతెలంగాణ-దహెగాం

పెద్దవాగుతో పాటు ఇతర వాగుల నుండి సాగుతున్న అక్రమ ఇసుక రవాణాపై నిఘా పెంచాలని తహసీల్దార్ కవితను కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శక్లా ఆదేశించారు. మండలంలోని వాగుల నుండి విచ్చలవిడిగా ఇసుక రవాణా జరుగుతున్నట్లు రాష్ట్రస్థాయిలో ఫిర్యాదు అందిందని తెలిపారు. రాత్రి వేళల్లో ఇసుక రవాణా జరగకుండా గస్తీ పెంచాలని పోలీసులను ఆదేశించారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

గిరిజన గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-నార్నూర్

ఉమ్మడి నార్నూర్, గాదిగూడ మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గాదిగూడ మండల రాయి సెంటర్ సార్మెడీలు కలెక్టర్ రాజర్షి షా ను కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందించి సమస్యలను విన్నవించారు. మంజూరైన గ్రామాలకు రోడ్డు పనులు ప్రారంభించాలని, రోడ్లు అవసరమైన గ్రామాల వివరాలకు ప్రభుత్వానికి నివేదించాలన్నారు. వేసవి నేపథ్యంలో తాగునిటీ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయులు లేక ఆదివాసీ విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని గిరిజన గ్రామాల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలన్నారు. ఇందులో ఆదివాసీ నాయకులు మందాడి దౌలత్ రావ్, పూసం బాధిరావ్, కొడప జాకు, మెస్రం జైవంత్ రావ్, మెస్రం సోము, మాజీ వైస్ ఎంపీపీ యోగేష్, రాజు, లింగు, సంతోష్, రాథోడ్ దిలీప్, శేఖర్‌బాబు ఉన్నారు.

కేటీఆర్, జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-ఆదిలాబాద్

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీష్ రెడ్డి దిష్టిబొమ్మను మంగళవారం బేల మండల కేంద్రంలోని శివాజీచౌక్‌లో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. కేటీఆర్, జగదీశ్ రెడ్డి స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ఇకనైనా వైఖరి మార్చుకోవాన్నారు. ఇందులో పార్టీ బేల మండల అధ్యక్షుడు ఫైదుల్లా ఖాన్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాందాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వామన్, బేల మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ గుండావార్, నాయకులు ఘన్ శ్యామ్, సుధాం రెడ్డి, అవినాష్, మాజీ ఎంపీటీసీ గోపతి శంకర్, సాగర్, హేమంత్ ఉన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రాజెక్టుకు అవార్డు

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదిలాబాద్ జిల్లాలోని 'తోటీలు- వారి జీవన స్థితి గతులు' అనే అంశంపై కళాశాల విద్యార్థులు ఇటీవల హైదరాబాద్‌లో ప్రదర్శించిన జిజ్ఞాస ప్రాజెక్టుకు రాష్ట్రస్థాయి అవార్డు రావడం అభినందనీయమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్ అన్నారు. ఈ ప్రాజెక్టు రూపకల్పనలో సహకరించిన తెలుగు అధ్యాపకులు యోగ లక్ష్మి, ప్రాజెక్టులో పాల్గొన్న విద్యార్థులు శంకర్, అంజలి, శిరీష, హరిక, గిరిజను మంగళవారం అభినందించారు. విద్యార్థుల ప్రాజెక్టుకు అప్రిసియేషన్ సర్టిఫికెట్ పొందడం అభినందింపదగిన విషయమన్నారు. ఇందులో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సాయిప్రసాద్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ నర్సింగ్ రావు, అధ్యాపకులు షేక్ ముజీబ్, జిజ్ఞాస కోఆర్డినేటర్ శ్రీకాంత్, శ్వేత, కపిల్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
6
బుధవారం | మార్చి 19, 2025 | www.navatelangana.com

గ్రామ పంచాయతీల అభివృద్ధికి చర్యలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిఎల్పిఓ ఉమర్ హుస్సేన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజంపేట గ్రామపంచాయతీ పరిధిలోని దినసంత, వారసంత, మేకల సంత వేలం పాట నిర్వహించారు. ప్రభుత్వ ధర ఎక్కువగా వార, దినసంతలు వేలం పలుకకపోవడంతో వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. మేకల సంత వేలం రూ.17.25 లక్షలకు రవిచంద్ర కాలనీకి చెందిన రాథోడ్ వినోద్ కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పదిమంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మౌనిక, పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ సంతోష్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లపై ప్రభుత్వం నిర్లక్ష్యం వద్దు

నవతెలంగాణ-జైనూర్



చాలిచాలని వేతనాలతో పని చేస్తున్న ఆశావర్కర్ల వేతనాలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఆశా వర్కర్ యూనియన్ మండలం అధ్యక్షురాలు సులోచన అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఆశావర్కర్లతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లను చిన్నచూపు చూస్తోందన్నారు.రూ. 18వేల వేతనం అందించేల బడ్జెట్ కేటాయించాలన్నారు. ఆశా వర్కర్‌కు పని భారం తగ్గించాలని, ఉద్యోగం భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వైద్యాధికారికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు ఓమ్లా, సంధ్యారాణి పాల్గొన్నారు.

వేసవిలో నిరంతర విద్యుత్ కోసం ఏర్పాట్లు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వేసవికాలంలో విద్యుత్ వినియోగదారుల అవసరాల నేపథ్యంలో నిరంతర విద్యుత్ అందించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ శేషారావ్, డీఈ వీరేశ, ఏడీఈ ఫిరోజ్ ఖాన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతంలో నాలుగు 100 కెవి అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏఈ లక్ష్మీరాజంతో కలిసి బిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో వేసవిలో ఇబ్బందులు వచ్చే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు, విద్యుత్తు లైన్ల మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. ఏదైనా విద్యుత్ సమస్యలుంటే 1912కు ఫోన్ చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లైన్‌మేన్ శంకరయ్య, కాంట్రాక్టర్ ప్రహ్లాద్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటేలో ఎంజేపీ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని బాబాపూర్ గ్రామంలో గల మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల చెందిన విద్యార్థినీలు ఇటీవల కాగజ్‌నగర్‌లో జరిగిన ఆరవ జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చాటారు. 13 మంది బాలికలు గోల్డ్ మెడల్ సాధించగా 12 మంది, సిల్వర్ 9 మంది బ్రాంచ్ మెడల్స్ సాధించారు. దీంతో పాటు 34 మంది విద్యార్థినీలు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించడంతో అభినందనలు వెలువెత్తుతున్నాయి. జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రత్నాబాయి, అధ్యాపకులు అభినందించారు. క్రీడల పట్ల ఉత్సాహం ఉన్న విద్యార్థులను ప్రోత్సహించడం జరుగుతుందని, బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

వ్యవసాయ పనిముట్లపై రాయితీ

నవతెలంగాణ-సిర్పూర్(టి)

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రికరణ పథకంలో భాగంగా రైతులకు వ్యవసాయ పనిముట్లు రాయితీపై అందించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి గిరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆసక్తి ఉన్న రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డ్, సాయిల్ హెల్త్ కార్డ్ మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలన్నారు. రాయితీపై వ్యవసాయ పనిముట్లు నాగలి, కల్టివేటరు, రోటవేటరు, ట్రాక్టర్ పనిముట్లు, తైవాన్ స్ప్రేయరు, పవర్ విడర్, పవర్ టిల్లర్, బ్యాటరీస్, స్ప్రేయర్ వంటి పరికరాలు రాయితీపై అందుబాటులో ఉన్నాయని, ఆర్థిక సంవత్సరం 2024-25కి గాను 100శాతం మహిళలకు వ్యవసాయ పనిముట్లు అందించడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న బోరంచు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీకని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులకు ఖర్జూర తినిపించి విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దామోదర్ రెడ్డి, ఎస్‌కే ముబారక్, ఎండీ ఇర్ఫాన్, మక్కా మసీద్ ఇమామ్ సాహెబ్, మౌజన్, అట్టు తల్వార్, ఫరూక్, ఖయ్యుమ్, రాజా, ఫయాజ్ షామా, జలీల్ పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కమలాకర్ అన్నారు. మండలంలో యువత చట్ట వ్యతిరేకమైన మట్కా జూదం ఆడుతున్నారనే సమాచారం మేరకు వెంకటరావుపేట గ్రామానికి చెందిన ఎలుములే పుణేశ్వర్ ఆడుతుండగా పట్టుకున్నారు. సిర్పూర్ గ్రామానికి చెందిన ఆవేజ్ అహ్మద్ హైదరాబాద్‌లో ఆడుతున్నాడని తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేశారు.

పసుపు నాణ్యత కోల్పోకుండా శుద్ధి చేసుకోవాలి

నవతెలంగాణ-పెంబి

పసుపును నాణ్యత కోల్పోకుండా శుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నవీన్ నాయక్ తెలిపారు. మంగళవారం మందపల్లిలో రైతు కూన శ్రీనివాస్ పంట కళ్లం వద్దకి వెళ్లి పసుపు ఉడికిస్తున్న ప్రక్రియను పరిశీలించి తగు సూచనలు చేశారు. అతిగా ఉడికిస్తే పసుపు కొమ్ములు నాణ్యత కోల్పోయి త్వరగా శిలీంద్ర బారినపడతాయని. దీంతో మార్కెట్లో గిట్టుబాటు ధర లభించకుండా పోయే అవకాశం ఉందని రైతులకు సూచించారు. రైతులు సంఘాలుగా ఏర్పడితే నాణ్యమైన పసుపు కొమ్ములను ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా నేరుగా అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్ముకునేందుకు వీలుగా వివిధ జాతీయ సంస్థలు రైతులకు తోడ్పాటు అందిస్తున్నాయని తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్ కుమార్, రైతు మహేష్ ఉన్నారు.

కుష్టు వ్యాధి పై గ్రామాల్లో సర్వే

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంతో పాటు మండలంలోని, భీంపూర్, కొత్తపల్లి, గోండుగూడ గ్రామాలలో వైద్య సిబ్బంది మంగళవారం కుష్టు వ్యాధి సర్వే చేశారు. కాగా సర్వే ప్రక్రియను హెల్త్ సూపర్ వైజర్ చౌహాన్ చరణ్‌దాస్ పరిశీలించి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు తగు సూచనలు చేశారు. ఇందులో వైద్య సిబ్బంది శ్యామక, కైలాష్, మోహన్ ఆశా కార్యకర్తలు అరుణ, జాదవ్ సుజాత ఉన్నారు.

ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ఈ నెల 31లోగా పునాది పనులు పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం మండలంలోని మేడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రావణపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పనులు పూర్తి చేసే విధంగా ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు. గ్రామంలోని ప్రజలకు మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధమైన తాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ ఏఈని ఆదేశించారు. వేసవికాలం దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా నిరంతరం తాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రాహుల్, సంబంధిత అధికారులున్నారు.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగవంతం చేయాలి

లే-అవుట్ భూముల క్రమబద్ధీకరణలో భాగంగా ఎల్ఆర్ఎస్-2020 పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్దిదారుల నుండి రుసుము వసూలు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. మండలంలో పర్యటించి భూమి క్రమబద్ధీకరణ పథకంలో చెల్లింపు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ రుసుము వసూలను వేగవంతం చేయాలని, చెల్లింపు ప్రక్రియలు జాప్యం జరగకుండా పర్యవేక్షించాలని, లబ్దిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీని దరఖాస్తుదారులు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు.అనంతరం మండల కేంద్రంలోని మార్కెట్ ప్రాంతంలో కొనసాగుతున్న కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మార్కెట్ సందర్శకులకు సౌకర్యంగా ఉండేలా సానిటరీ కాంప్లెక్స్ పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని, మార్కెట్ కు వచ్చే ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పనులు త్వరితగతిన పూర్తి చేసేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు.

ఎమ్మెల్సీ కవిత పోరాటంతోనే బిల్లులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోరాట ఫలితంగానే బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు పెంచడానికి రెండు వేరువేరు బిల్లులను పెట్టిందని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు రంగినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీసీల కోసం ఎమ్మెల్సీ కవిత చేసిన ఉద్యమానికి ప్రభుత్వం తలొగ్గిందని, అందుకు ఎమ్మెల్సీ కవితకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇది తెలంగాణ జాగృతి సాధించిన మరో భారీ విజయంగా అభివర్ణించారు. సుదీర్ఘకాలంగా ఈ దేశంలో అన్ని రకాల అన్యాయాలకు గురైన బీసీ సోదరులకు రిజర్వేషన్ల కోసం విద్యా, ఉపాధి, రాజకీయ రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రెండు వేర్వేరు బిల్లులను ప్రవేశ పెట్టడం స్వాగతిస్తున్నామని తెలిపారు. విద్యా ఉపాధి రాజకీయ రిజర్వేషన్లకు కలిపి ఒకే బిల్లు పెడితే బీసీలకు అన్యాయం జరుగుతుందని, ముందే గుర్తించి వేరువేరు బిల్లులు పెట్టాల్సిందే అని డిమాండ్ చేసింది కేవలం జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత మాత్రమే అని గుర్తు చేశారు. బిల్లు ప్రవేశపెట్టి చేతులు దులుపుకోకుండా కేంద్రం మీద ఒత్తిడి తెచ్చి రిజర్వేషన్లు సంపూర్ణంగా అమలయ్యే వరకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. రిజర్వేషన్లు సంపూర్ణంగా అమలయ్యే వరకు బీసీ సోదరుల పక్షాన జాగృతి ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో చెన్నా సాయిక్రిష్ణ, అసపు ప్రమోద్, శ్రీపాద కార్తీక్, శ్రీనివాస్, డేవిడ్ పాల్గొన్నారు.

గుస్సాడికి గిన్నిస్‌లో చోటు గర్వకారణం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదివాసీ, గిరిజన సాంప్రదాయమైన గుస్సాడీలో జాతీయస్థాయిలో రాణించి జిల్లాకు వన్నె తేవడమే కాకుండా గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించడం గర్వకారణమని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని తిర్యాణి మండలం దంతన్‌పల్లి గ్రామానికి చెందిన భీమయ్య కొలం గుస్సాడీ బృందానికి ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ డేవిడ్, డిటిడిఓ రమాదేవి, గిరిజన సంఘాల నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం సాంస్కృతిక మంత్రిత్వ శాఖ దేశ వ్యాప్తంగా దేశ రాజధాని ఢిల్లీలో 5 వేల మంది కళాకారులతో నిర్వహించిన గుస్సాడీ ప్రదర్శనలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జయతి జయమమ భారత్ గుస్సాడీ కార్యక్రమంలో దంతన్‌పల్లి పీవీటీజీ కొలం గుస్సాడీ బృందం అందించిన ప్రదర్శనతో రికార్డ్ సృష్టించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో స్థానం సంపాదించడం గర్వంగా ఉందన్నారు. గిరిజన ఆచారాలను, సంస్కృతి సాంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించాలన్నారు. గిరిజన యువత సంస్కృతి, విద్య క్రీడా రంగాలతో పాటు అన్ని రంగాలలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం



గుస్సాడీ బృంద సభ్యులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, గిరిజన సంఘాల నాయకులు సిడాం అర్జు, ఆత్రం గంగారం, మడావి భీంరావు, కుర్సింగ మూతిరామ్, ఆత్రం సంతోష్, చాహకటి దసర పాల్గొన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-నిర్మల్



పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరీక్షల నిర్వహణకై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలన్నారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలను నిర్వహించాలని, ప్రతి పరీక్ష కేంద్రంలో త్రాగునీరు, వైద్య సిబ్బంది, ఓఆర్ఎస్ పొట్లాలు, ఇతర అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రాల 144 సెక్షన్ అమలు పరచి, పటిష్ఠ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ కేంద్రాలను మూసి ఉంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈఓ రామారావు, భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, డీఎంహెచ్ఓ రాజేందర్, విద్యుత్ శాఖ డీఈ వెంకటేశ్వర్లు, విద్యాశాఖ అధికారులు పద్మ లింబాద్రి, ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

నవతెలంగాణ-బోథ్

నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని, ఈ ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధి హామీ పని దినాలు పెంచాలని, మిషన్ భగీరథ నీటి సరఫరా పెంచాలన్నారు. ప్రస్తుతం వస్తున్న నీరు అవసరాలకు సరిపోవటం లేదన్నారు. సమీప పొలాల నీటిని అవసరాలకు వినియోగించేలా చర్యలు చేపట్టాలని కోరారు. పర్వత ప్రాంతాల్లో నీటి నిల్వలు పెంచడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో బోథ్, ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు భోద్దు గంగారెడ్డి, కోమురం సత్యవతి కోటేశ్వర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పసుల చంటి, పీఏసీఎస్ డైరెక్టర్ గొర్ల రాజు యాదవ్, షేక్ అబుద్, జ్యోతిరాం పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్‌లు అందజేత

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఖోడద్ ప్రభుత్వోన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం హనుమాన్ క్రికెట్ టోర్నమెంట్, అభ్యుదయ, సీజన్, అరుణోదయ, శ్రీచైతన్య యువజన సంఘాలత ఆధ్వర్యంలో ప్యాడ్‌లు పంపిణీ చేశారు. పదవ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తుండటంతో యువజన సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు ఇతరతలు అందజేశారు. ఇందులో పాఠశాల హెచ్ఎం కష్ణకుమారి, యువజన సంఘాల నాయకులు వినాయక్, నరేష్, అశోక్, శ్రీకాంత్, నిఖిల్, గంగాధర్, సంతోష్, యోగేష్, యోగి, దేవన్న గ్రామస్తులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనానికి వంట పాత్రలు పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ అర్బన్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజన నిర్వహణకు వంట పాత్రలను జిల్లా విద్యాశాఖ రిక్టోరల్ అధికారి నారాయణ మంగళవారం అందజేశారు. దీంతో మధ్యాహ్నం భోజన ఏజెన్సీల సమస్యలు తీరుతాయని పేర్కొన్నారు. ఇందులో ఎంఈఓ సోమయ్య, జిల్లా పాఠ్య పుస్తకాల మేనేజర్ సత్యనారాయణ, సీఆర్‌పీలు అశ్వక్, జావేద్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఉన్నారు.

మాభూమి రథయాత్రను విజయవంతం చేయండి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్, రాజ్యాధికార జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ సంయుక్తంగా డీఎస్పీ అధినేత డా.విశారదన్ మహరాజ్ నేతృత్వంలో చేస్తున్న లక్ష కి.మీ మాభూమి రథయాత్రను విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహరాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ భవనంలో పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్య స్థాపనకు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. బడుగు బలహీనర్గాలకు, అట్టడుగు కులాల ఆత్మ గౌరవం కోసం చేస్తున్న ఈ యాత్రలో బీసీ ఎస్సీ ఎస్టీ ,అగ్రకులాల పేదలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్, వివిధ మండల, జిల్లా నాయకులు జిల్లా నాయకులు అన్నెల అడేల్లు, సర్కిల్ నరేష్, బడుగు రాజేశ్వర్, సురేష్, ధుమ్మ తిరుపతి, ప్రశాంత్, సంతోష్, నవీన్, సంతోష్, నవీన్, గంగన్న, సాయి, నర్సింగ్, నిఖిల్, గంగయ్య, రాకేష్, రవి ఉన్నారు.

పీడీఎస్ బియ్యం నిల్వ చేసిన వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-ఖానాపూర్

పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసినందుకు పట్టణంలోని ఇంద్రానగర్‌కు చెందిన కడమంచి లక్ష్మణ్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం స్థానికుల నుంచి సుమారు 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచగా సోమవారం రాత్రి పెట్రోలింగ్ భాగంగా పోలీసులు పట్టుకోవడం జరిగిందన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించినట్లు, ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చేతిపంపునకు సన్మానం

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రంలోని మైసమ్మకాలనీ వాసులు మంగళవారం చేతిపంపును శాలువాతో సన్మానించారు. కాలనీలో 1995లో కాలనీ నీటి సమస్యను గుర్తించి ప్రభుత్వం చేతిపంపు వేయించిందని, అప్పటి నుంచి నేటి వరకు కాలనీతో పాటు చుట్టుపక్క కాలనీల అవసరాలను తీరుస్తున్నందుక ప్రత్యేక పూజలు చేసి సన్మానించినట్లు కాలనీవాసులు పేర్కొన్నారు. ఇందులో కాలనీవాసులు అంజన రాము, పలిక్ రమేష్, బాల్గం నవీన్, కొప్పుల భోజన్న, అల్లాడి శేఖర్, ప్రకాష్, కిషన్ ,గంగాధర్, నహీం, కమల, భాస్కర్, రాజు పాల్గొన్నారు.


చరిత్ర విభాగం ఆధ్వర్యంలో ఉపన్యాసం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ కామర్స్) కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం విస్తృత ఉపన్యాసం నిర్వహించారు. కార్యక్రమానికి చరిత్ర ఆచార్యులు డా.కె.మురళి పాల్గొని విద్యార్థులకి చరిత్ర పట్ల అవగాహన కల్పించి, దిశా నిర్దేశం చేశారు. ఇందులో కళాశాల ప్రిన్సిపాల్ డా.అతీక్ బేగం, చరిత్ర అధ్యాపకులు యాకూబ్ అలీ, సోనీ, పద్వీరాజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

11కేవీ ఫీడర్‌కు వీసీబీ ఏర్పాటు

నవతెలంగాణ-దస్తురాబాద్



సీఎండీ ఆదేశాల మేరకు మండలంలోని బుట్టపూర్ గ్రామ పంచాయతీలో గల సబ్‌స్టేషన్‌లో 11 కేవీ ఫీడర్‌కు వీసీబీ ఏర్పాట్లు చేసినట్లు ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ వినియోగదారులకు విద్యుత్ అంతరాయం ఉండకూడదని వీసీబీ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. దీంతో రానున్న రోజుల్లో దస్తురాబాద్ సబ్ స్టేషన్ విద్యుత్ అంతరాయం ఏర్పడితే క్షణాల్లో బాగు చేయడానికి వీలుంటుందన్నారు. విద్యుత్ సమస్య ఏర్పడితే వెంటనే తెలియజేయాలని, సకాలంలో విద్యుత్ బిల్లులను చెల్లించాలని కోరారు. ఇందులో కాంట్రాక్టర్ నవీన్ రెడ్డి, లైన్ ఇన్స్‌పెక్టర్ మహేందర్, ఏఎల్ఎం రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన ముట్టడికి వెళ్లకుండా స్థానిక బీఆర్ఎస్ నాయకులను పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారన్నారు. అరెస్టైన వారిలో పూదరి బిట్టు, రిజ్వాన్‌ఖాన్, చందు, చరణ్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ

నవతెలంగాణ-నార్నూర్

ఇటీవల విడుదలైన హెచ్‌డబ్ల్యూఓ ఫలితాల్లో ఆదివాసీ ముద్దు బిడ్డ మర్సుకొల గాంధారిబాయి ఉద్యోగం సాధించడం అభినందనీయమని ఉపాధ్యాయ సంఘం నాయకులు మెస్రం శేఖర్, రామారావ్ అన్నారు. గాదిగూడ మండలంలోని ఝరి ఆశ్రమ పాఠశాల కాంప్లెక్స్‌లో ఈ మేరకు ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. పర్సవాడలో సీఆర్పీగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగం సాధించడం సంతోషకరమన్నారు. ఇందులో ఉపాధ్యాయులు బాజీరావ్, గోవింద్‌రావ్, సీఆర్పీ హన్మంత్ రావ్, లక్ష్మణ్ ఉన్నారు.

ఎస్పీని కలిసిన మహర్ జిల్లా అధ్యక్షుడు

నవతెలంగాణ-బోథ్



మహర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కాంబ్లే భీంరావ్ మంగళవారం ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందించి, శాలువాతో సన్మానించారు. ఇందులో ఎస్పీని కలిసిన వారిలో ఆయనతో పాటు సంఘం మహిళా అధ్యక్షురాలు సవిత బాయి, నాయకులు లక్ష్మణ్ రావు, రామరావు పటేల్, అనిల్, జితేందర్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి

నవతెలంగాణ-సిరికొండ



విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకెళ్లాలని మండల విద్యాధికారి సునిల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించగా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు భయాందోళన చెందకుండా చక్కగా చదివి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా తొమ్మిదో తరగతి విద్యార్థులు నత్యాలు చేస్తూ, పాటలు పాడి వీడ్కోలు పలికారు. అనంతరం విద్యార్థులకు హల్ టికెట్లను అందజేశారు. ఇందులో ఉపాధ్యాయులు వేణు గోపాల్, చంద్రకాంత్, సత్య నారాయణ, సంతోష్ పాల్గొన్నారు.